# 4

# క్రీస్తు, మన ప్రధాన యాజకుడు

# (భాగము 1)

## (4:1-16)

**క్రీస్తు యొక్క విశ్రాంతి (3:7-4:13) (కొనసాగింపు)**

హెబ్రీయులకు వ్రాయబడిన పత్రికలో పదమూడు హెచ్చరిక వాంగ్మూలములు కలవు. ఈ మందలింపులు "మనము ... చేపట్టుదము" / "మనము ... చేయుదము" / "మనము ... కలిగియుందము" మొ॥ అని సర్వసాధారణంగా అనువదింపబడు గ్రీకు పదసముదాయముతో స్పష్టంగా గుర్తుపెట్టబడి యున్నవి (4:1, 11, 14, 16; 6:1-2; 10:22, 23, 24-25; 12:1-2, 28-29; 13:13, 15). మొదటి మందలింపు "భయమును" పేర్కొనుచున్నది, దీనిని కొందరు వ్యతిరేకార్థకమైన భావోద్రేకముగా పరిగణిస్తారు; ఏది ఏమైనా, భయమనేది తెలివికి మరియు జ్ఞానమునకు మూలమై యున్నది (సామెతలు 1:7; 9:10), ఈ రెండూ కూడ నిర్మాణాత్మకమైన ప్రత్యేక గుణలక్షణములై యున్నవి. పాఠకులు వారి జీవితంలో అంతకంతకు అధికమగుచుండు ఔన్నత్యమైన స్థాయికి చేరుకొనవలెనని ప్రతి ఒక్క మందలింపు వారికి పిలుపు నిచ్చుచున్నది. 3:1తో మొదలయ్యే ఈ విభాగము యొక్క చరమ దశ 4:1-13 అయియున్నది, మోషే కంటే క్రీస్తే ఉన్నతమైనవాడనే విషయాన్ని వారు అంగీకరించాలనియు, తత్ఫలితంగా వారు యూదు మతమును విడిచిపెట్టవలెననియు ఈ విభాగం హెబ్రీ పత్రిక తొలి పాఠకులకు ఆజ్ఞాపించుచున్నది.

**ఇశ్రాయేలీయులకు ఇయ్యబడిన వాగ్దానము క్రైస్తవులకు సహితం అందుబాటులో ఉన్నది (4:1-13)**

సబ్బాతు దిన విశ్రాంతిని గూర్చిన మూడు మందలింపులు (4:1-4)

**1ఆయనయొక్క విశ్రాంతిలో ప్రవేశించుదుమను వాగ్దానము ఇంక నిలిచియుండగా,**
**మీలో ఎవడైనను ఒకవేళ ఆ వాగ్దానము పొందకుండ తప్పిపోవునేమో అని భయము**
**కలిగియుందము. 2వారికి ప్రకటింపబడినట్లు మనకును సువార్త ప్రకటింపబడెను, గాని**
**వారు వినిన వారితో విశ్వాసముగలవారై కలిసియుండలేదు గనుక విన్న వాక్యము వారికి**
**నిష్ప్రయోజనమైనదాయెను. 3కాగా జగత్తువాది వేయబడినప్పుడే ఆయన కార్యములన్నియు**
**సంపూర్తియైయున్నను ఈ విశ్రాంతినిగూర్చి**

**-నేను కోపముతో ప్రమాణముచేసినట్టు**

**వారు నా విశ్రాంతిలో ప్రవేశింపరు**

**అని ఆయన చెప్పిన మాట అనుసరించి, విశ్వాసులమైన మనము ఆ విశ్రాంతిలో**
**ప్రవేశించుచున్నాము. 4మరియు**

**–దేవుడు ఏడవ దినమందు తన కార్యములన్నింటిని ముగించి విశ్రమించెను అని యేడవ దినమునుగూర్చి ఆయన యొకచోట చెప్పియున్నాడు.**

మనము ప్రస్తుతము అధ్యయనము చేయుచున్న వాక్యభాగము, 4:1–4, పాఠకునికి విశ్రాంతి దినము నాటి విశ్రాంతి గూర్చిన మూడు మందలింపుల నిచ్చుచున్నది. దీనిని మనము "మన విశ్రాంతి దినమునకు సంబంధించిన విశ్రాంతి విషయంలో 'మనము … చేయుదము'" అని పిలుచుకొనవచ్చు.

**వచనము 1.** NASBలో గల **కాబట్టి** అనే అర్థమిచ్చు మాట 4వ అధ్యాయమును మొదలుపెట్టు, 3వ అధ్యాయంలో మొదలైన చర్చోపచర్చ కొనసాగుతున్నదని చూపించుచున్నది. 3:12–19లో గల హెచ్చరికలు 4వ అధ్యాంలోని ఆలోచనలతో ముగియుచున్నవి, అవి వాటి చేత వ్యతిరేకింపబడుట లేదు. **భయము కలిగియుందము** అనే మాటలు "మనము పెడదారి పట్టకుందము" అనే మాటలుగా వక్రీకరింపబడకూడదు; పరిస్థితి అంత కంటె ఘోరమైనదిగా నున్నది.

*మొదటి ఆజ్ఞ "భయపడుట" గూర్చిన ఉత్తరువై యున్నది. పాఠకుడు వాని పరిస్థితి స్వభావము పట్ల ఆరోగ్యవంతమైన మర్యాద కలిగియుండవలెనని అది వానిని విన్నవించుకొనుచున్నది.*

"భయము" అనేది హెబ్రీ పత్రికలో ఒక ముఖ్యమైన భావనయై యున్నది. దేవుని పట్ల సరైన భయముగలవాడు నమ్మదగినవాడై యుంటాడు గనుక వాడు **ఆయన విశ్రాంతిలో** ప్రవేశించక మానడు.

1–4 వచనములలో గల "విశ్రాంతి" (*katapausis*) అనే పదమునకు అనేక అర్థాలుండుట సాధ్యమే. మొదటిది, 3వ వచనంలోని వర్తమాన కాలము క్రైస్తవ యుగమంతటికి వర్తించినట్లయితే, అది "దేవుని సమాధానము" (ఫిలిప్పీయులకు 4:7) అనే వ్యక్తీకరణమువంటి అర్థమీయవచ్చు. అనగా, అది మన ప్రస్తుత సొత్తై యున్నదని మరొక మాటలో చెప్పుకొనవచ్చు. ఈ అభిప్రాయమును ఎఫ్. ఎఫ్. బ్రూస్ అంగీకరించలేదు, ఎందుకనగా 4:1–3వచనములలోని విశ్రాంతి అనేది, "విశ్వాసులమైన మనము ఆ విశ్రాంతిలో ప్రవేశించుచున్నామని" వర్తమాన కాలము సూచించుచున్నది గనుక అది "సాధించడానికి మున్ముందున్న విషయమై యున్నదని" ఆయన చెప్పాడు.[1] రెండవదిగా, దేవుడు ఆరు దినములు సమస్త సృష్టిని సృజించిన తరువాత ఏడవ దినమున విశ్రమించిన ఆ విశ్రాంతిని అది సూచించవచ్చు. మూడవదిగా, అది ఇశ్రాయేలీయులకు వాగ్దానము చేయబడిన దేశము గూర్చి వాడబడింది. 3వ వచనంలో మనము "నా విశ్రాంతి" గూర్చి చదువుచున్నాము, ఇది కీర్తనలు 95:11లో నుంచి తీసికొనబడిన పదజాలమై యున్నది. ఇచ్చట, "నా విశ్రాంతి," దేవుడు చేపట్టిన సృష్టి కార్యమంతా ముగింపబడిన తరువాత ఆయన విశ్రమించిన విశ్రాంతి (ఆదికాండము 2:2), మరియు వాగ్దానము చేయబడిన దేశమును పరోక్షంగా ప్రస్తావించుచున్నది. నాలుగవది, ఈ పదము ప్రయోగింపబడుచున్న వీటిని మించి, **నిలిచియుండు** విశ్రాంతి ఉన్నది.[2] నిలిచియుండు ఈ విశ్రాంతి క్రైస్తవ యుగములో నీతిమంతులై యుంటూ నమ్మకముగా ఉండు వారి కొరకైనదై యున్నది.

ఆదికాండములోని ఏడవ దినము సందర్భములో “సాయంకాలము” అనే మాట పేర్కొనబడలేదు గనుక దేవుని విశ్రాంతి దినము ఇప్పటికిని కొనసాగుచునే యున్నదని కొందరు యూదు మత బోధకులు నమ్మారు.[3] దేవుడు ప్రతి సబ్బాతునాడు విశ్రాంతి తీసుకున్నాడని ఇతరులు నమ్మారు.[4] ఈ విధంగా “విశ్రాంతి దినమునకు” అంతము లేకుండింది. హెబ్రీ పత్రిక రచయిత ఆందోళన అంతా నాలుగవ “విశ్రాంతి” యొక్క భావము - పరలోకమందలి నిత్య విశ్రాంతిని గూర్చినదై యున్నది. ఈ “విశ్రాంతి” ఈ పత్రికలోని ప్రాథమిక ఉద్ఘాటనయై యున్నది.

మొదటి వచనంలోని “ఆయన విశ్రాంతి” దేవుడు పరిశుద్ధుల కోసం సిద్ధపరచిన ప్రతిఫలమై, పరలోకమందలి విశ్రాంతియై యున్నది. దీనికి తోడుగా, క్రైస్తవులు వాస్తవంగా దేవుని విశ్రాంతి లోనికి ఇప్పుడు ప్రవేశించగలరు. “ఇది కేవలము దేవుని చేత ఇవ్వబడిన విశ్రాంతి కాదు; ఇది దేవునిదే అయియున్న, విమోచింపబడిన వారితో ఆయన పంచుకొను ఆయన సొంత విశ్రాంతియై యున్నది.”[5] మనకు ఇప్పటి విశ్రాంతిని గూర్చిన హామీలున్నవి (మత్తయి 11:28-30), దీనిని “దేవుని సమాధానము” (ఫిలిప్పీయులకు 4:7), “నిత్య విశ్రాంతి” (ప్రకటన 14:13) అని పిలువవచ్చు. ప్రాచీన కాలం నాటి ఇశ్రాయేలీయులు ప్రవేశించిన విశ్రాంతి దేవుని నిత్య విశ్రాంతికి నమూనా మాత్రమే అయియుండింది.

ఐగుప్తును విడిచి ఇశ్రాయేలీయులలో అధిక సంఖ్యాకులకు సంభవించిన సంఘటన దృష్ట్యా - అనగా, వాగ్దానము చేయబడిన విశ్రాంతిలోనికి వారు ప్రవేశింపకపోవుట - మనము భయపడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ హెచ్చరికలు మనకు ఏదైనా మంచి అర్థము నీయవలెనంటే, మనము దేవుని కృప నుంచి పతనమై దానిని కోల్పోవడం సాధ్యమే అని మనము అంగీకరించాల్సి వుంటుంది. ఇశ్రాయేలీయుల ఒక తరమువారు కనాను దేశంలో ప్రవేశింపలేకపోయారు. క్రైస్తవులు దేవుని నిత్య “విశ్రాంతిని” నిజముగా కోల్పోవు అపాయమును ఎదుర్కొననట్లయితే, ప్రేరేపింపబడిన ఈ పత్రిక రచయిత ఇటువంటి హెచ్చరిక మాటలు వ్రాయల్సిన అవసరం లేదు.

వాని ప్రాథమిక లక్ష్యము దేవుని విశ్రాంతి లోనికి ప్రవేశించుటయై యున్నదో లేదో నిర్ధరించడానికి ప్రతి ఒక్క క్రైస్తవుడు తనను తాను నిరంతరం పరీక్షించుకొనుచుండవలెను (2 కొరింథీయులకు 13:5). గతంలోని అనుభవాల నుంచి, ప్రత్యేకించి దేవుడు తన ప్రజలతో వ్యవహరించు విధానాల గూర్చి నేర్చుకొనడం, మనకు ఎంతో సహాయకరంగా ఉంటుంది.[6] ఇశ్రాయేలీయులు దేవునితో కలిగియుండిన సంబంధంలో, దేవునియందు నమ్మకముంచు విశ్వాసము కొరవడుట గొప్ప హానికరమైన పరిస్థితి యని వారు పతనమై నశించిపోవుట ద్వారా రుజువుచేయబడింది. మనము కూడ వారి వలెనే ప్రవర్తించి నాశనమగుటకు అవకాశములు కలవని పై వాస్తవము మనకు అర్థమీయవలెను. 1 కొరింథీయులకు 10:1-13లో పౌలు వ్రాయుచుండిన విషయం ఇదే. పౌలు యొక్క తుది అభిప్రాయమునకు మనము ఆందోళన చెందుతూ పట్టుదలతో దానిని అంగీకరించాలి: “కాబట్టి తాను నిలుచుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను” (వచనము 12). ఆయన మాటల్లోని సహేతుకమైన అభిప్రాయాన్ని తీసుకున్నట్లయితే, ఇశ్రాయేలీయులకు అరణ్యములో భౌతికంగా సంభవించిన సంఘటనలు మనకు ఆత్మసంబంధంగా సంభవించవచ్చు. అనగా, మన విశ్వాసం తడబడినప్పుడు పరలోకముపై మనకు గల పట్టును మనము కోల్పోవుదుమని

మరొక మాటలో చెప్పుకొనవచ్చు.

ఐగుప్తు దేశమును విడిచి వచ్చిన మీదట, అబ్రాహాము వంశస్థులు నేరుగా వాగ్దాన దేశములో ప్రవేశించలేదు. కొన్ని పరీక్షల పరంపరల నిమిత్తమై వారు ఆరణ్యములోనికి కొనిపోబడ్డారు, అయితే వారు అనేకమైన పరీక్షల్లో ఓటమిపాలయ్యారు. అదే విధంగా, మనము మన పరలోక విశ్రాంతి లోనికి వెంటనే ప్రవేశించము. దానిలో క్రీస్తు నుంచి దూరమై అనేకులు నశించుచున్న అరణ్యము వంటి సామాజిక ప్రపంచం గుండా పయనించుటకు ఈ జీవితంలో మనము బలవంతము చేయబడుతున్నాము.

ఈ హెబ్రీయులు క్రీస్తు అరోహణమైన నాటి నుంచి కేవలము ముప్పై ఐదు సంవత్సరములకే అంతకంతకు అధికంగా అలసిపోతున్నట్లయితే, రెండు వేల సంవత్సరముల అనంతరం ఆ విశ్రాంతిని వెదకుటలో క్రైస్తవులు అలసిపోవుదురనేది విదితమవుతుంది. ఒకడు ధైర్యమును కోల్పోవచ్చు, నులివెచ్చనివాడైపోవచ్చు, గనుక దేవుని నిత్య వాగ్దానములను కోల్పోవచ్చు. లవొదికయ సంఘస్థులు నులివెచ్చనగా అయ్యారు గనుక రక్షకుని చేత "ఉమ్మివేయబడివలసినవారై" యుండిరి (ప్రకటన 3:14–16). వాగ్దానముల నెరవేర్పుగా వారికి ఏమి ఇవ్వబడనై యుండిందో, అబ్రాహాము మరియు పాత నిబంధనలోని ఇతర విశ్వసనీయమైన సేవకులకు పూర్తిగా తెలిసియుండలేదనే విషయాన్ని మనము జ్ఞాపకముంచుకొనవలెను. అట్లయినప్పటికిని, "దూరము నుండి చూచి, వందనము చేసి" (హెబ్రీయులకు 11:13), వారి విశ్వాసం విషయంలో వారు విశ్వసనీయమైనవారుగానే నిలిచియుండిరి.

హెబ్రీ పత్రిక గ్రహీతలలో **ఎవడైనను ఒకవేళ ఆ వాగ్దానము పొందకుండ తప్పిపోవునేమో** అనే మాటలు, తప్పిపోవుట సాధ్యమై యుండవచ్చునని కొందరికి అనుమానాన్ని కలిగిస్తున్నాయి. విషయం ఇదే అయినట్లయితే, అసలు ఈ హెచ్చరిక యొక్క అవసరమే ఉండదు. "మీలో ఏ ఒక్కడైనను తప్పిపోకుండునట్లు తగు జాగ్రత్త వహించుడి" అని NIVలో వ్రాయబడి యున్నది. "విఫలమవుటకు గల అవకాశము కంటె, నిశ్చయమైన తీర్పు గూర్చిన తెలివి, ఒకడు భయపడుటకు అతి గొప్ప కారణమై యున్నదనేది" ఈ వాక్యభాగము యొక్క సరైన దృష్టికోణమైయున్నది.[7] "కాబట్టి" అంటూ 4వ అధ్యాయమును మొదలుపెట్టుచున్న మాట, 3వ అధ్యాయంలోని చర్చోపచర్చను ఈ అధ్యాయం కొనసాగిస్తున్నదని చూపించుచున్నది. 3:12–19లోని హెచ్చరికలు నాలుగవ అధ్యాయంలోని తలంపులతో ముగియుచున్నవి గనుక అవి వాటిని వ్యతిరేకించడం లేదు. భయము కలిగియుందము అనే మొదటి వచనంలోని మాటలు "మనము పెడదారి పట్టకుందము" అనే మాటలుగా వక్రీకరింపబడకూడదు; పరిస్థితి అంత కంటె ఘోరమైనదిగా నున్నది. దేవుని సింహాసనము యెదుట నిలువబడి, దేవుని విశ్రాంతిని సాధించుటలో మనము మన అవకాశమును కోల్పోయామని అప్పుడు అర్థం చేసికొనడం ఎంత విషాదాంతమైన విషయమవుతుంది కదా! మనమందరమును "క్రీస్తు న్యాయపీఠము యెదుట" నిలువబడుదుము, ఇది కచ్చితమని గుర్తెరుగు! (2 కొరింథీయులకు 5:10).

**వచనము 2.** *మనకివ్వబడిన వాక్యమును ఆలకించాలి మరియు దాని ప్రకారం జీవించాలనేది రెండవ ఉత్తరువై యున్నది.* మనకొక సందేశం బోధింపబడింది, గనుక మనము దానిని అంగీకరించి దానికి లోబడుతున్నామని రూఢిపర్చుకొనవలసి యున్నది.

**మనకు సువార్త ప్రకటింపబడెనని** రచయిత చెప్పుచున్నాడు. "మనకు సువార్త ప్రకటింపబడి యుండింది" అని అర్థమిచ్చే మాటలు KJVలో రచింపబడినవి. "సువార్త" అనే మాట "God's spel," or "God's Word." అనే Anglo-Saxon పదము నుంచి పుట్టింది. అసలైన పదము euangelizō, నుంచి పుట్టింది, అది "శుభ వార్త" ("good news") లేక "సంతోషకరమైన సువర్తమానమును" ("glad tidings") ప్రకటించుట అని అర్థమిస్తుంది. దేవుడు మానవునికి బయలుపరచిన ప్రత్యక్షత విషయంలో ఇది అతిగా సుముఖమైన క్రొత్త నిబంధన పదమై యున్నది. ఈ అవగాహన చొప్పున, అప్పుడు ప్రకటింపబడిన "శుభ వార్త" ఇహలోక సంబంధమైన విశ్రాంతిని గూర్చినది మాత్రమే అయియుండినప్పటికిని, పాత నిబంధన కాలములో జీవించుచుండినవారికి "సువార్త" ప్రకటింపబడిందని చెప్పవచ్చు. క్రొత్త నిబంధన ప్రకారమైన "సువార్త" దాని స్వభావంలో పూర్తిగా భిన్నమైనదై యుంటున్నప్పటికిని, ఇవే పదములు రెండు సందర్భములలోను ప్రయోగింపబడుచున్నవి. అలాగని, పాత నిబంధన నుంచి క్రొత్త నిబంధన లోనికి కొనసాగిన ఒకే ఒక్క ఒడంబడిక (నిబంధన) ఉండిందనేది దీనర్థం కాదు.

"ఏలయనగా మనకును వారికిని సువార్త ప్రకటింపబడింది" అనేది ఈ పదజాలము యొక్క అక్షరార్థమైన అనువాదమై యున్నది. ఇదే విధమైన భావం 1 కొరింథీయులకు 10:3, 4లో కూడ కనబడుతుంది, "అందరు ఆత్మసంబంధమైన ఒకే ఆహారమును భుజించిరి; అందరు ఆత్మ సంబంధమైన ఒకే పానీయమును పానము చేసిరి. ఏలయనగా తమ్మును వెంబడించిన ఆత్మసంబంధమైన బండలోనిది త్రాగిరి; ఆ బండ క్రీస్తే" అని ఈ వాక్యభాగం సెలవిస్తుంది. నిశ్చయంగా, మౌలికమైన కొన్ని అంశాలు ఒక్కటే అయియున్నవి – ప్రత్యేకించి రక్షకుని ఆవశ్యకత మరియు ఆయన మీద మాత్రమే ఆధారపడుటకుగల అవసరమును ఇశ్రాయేలీయులు మరియు క్రైస్తవులు కూడ గుర్తించాల్సి వున్నది. ఒకరికి ఇవ్వబడింది తాత్కాలిక నివాస ప్రదేశం, కాని మరొకరికి ఇవ్వబడింది నిత్య జీవము.

ప్రభునంగీకరించినవారు కొద్ది మంది మాత్రమే ఉన్నప్పటికిని, ఒక పట్టణము లేదా ఒక ప్రాంతము, వారికి ప్రకటింపబడిన సువార్త సందేశమును విన్నదనే భావమును "సువార్త ప్రకటింపబడుట" గూర్చిన అభిప్రాయం సూచించుచున్నది. ఏదైన ఒక ప్రాంతములో సువార్త ప్రకటింపబడిందని చెప్పుకోడానికి ప్రభువునంగీకరించినవారు నిశ్చితమైన శాతంలో ఉండనక్కర్లేదు. విశేషంగా, ప్రజలకు సువార్త అందుబాటులో ఉండునట్లు చూడటమే ముఖ్యం.[8]

ఇశ్రాయేలీయులలో అధిక శాతం మంది వారికి ప్రకటింపబడిన సువర్తమానమును తృణీకరించారు గనుక, **విన్న వాక్యము వారిక నిష్ప్రయోజనమైనదాయెను వారు వినిన వారితో విశ్వాసముగలవారై కలిసియుండలేదనేది** ఇందుకుగల హేతువై యున్నదని రచయిత తన అభిప్రాయాన్ని తెలియజెప్పుతున్నాడు.[9] సువార్తను వినినవారు, వారు వినిన సందేశమును విశ్వాసముతో కలుపలేదు, అయితే అది వారి బాధ్యతయై యుండింది. మన విశ్వాసము దేవుడు మనకిచ్చిన వరమే కాని, మన సొంత ప్రయాసము యొక్క ఫలితం కాదనెడి అభిప్రాయమును ఈ వచనము తొలగించుచున్నది.

సంఖ్యాకాండము 14:26–34, వేగులవారుగా వెళ్లి, వేగు చూచి వెనుదిరిగిన యెహోషువ

మరియు కాలేబు, వారికుండిన విశ్వాసమును ఆధారం చేసుకొని ఒక నిర్ణయమునకు వచ్చి దానిని వారికి నివేదించినందువలన, ప్రజలు వారిని రాళ్లతో కొట్టిచంపుదురని బెదిరించినప్పుడు ఏర్పడిన తిరుగుబాటును గూర్చిన కథను చెప్పుచున్నది. అలాగైతే, ఇరవై సంవత్సరముల కంటె తక్కువ వయస్కులైనవారు సంహరింపబడరని దేవుడు ఎందుకు వాగ్దానం చేసినట్టు? వయోజనులైన వారి కంటె చిన్న వయస్కులైన తరమువారిలో ఎక్కువ విశ్వాసము ఉన్నదని (బలమైన విశ్వాసమునకు ఎక్కువ అవకాశమున్నదని) చూచినందునుబట్టి, వారు మాత్రమే కాలేబు మరియు యెహోషువతోపాటు వాగ్దానము చేయబడిన దేశములో ప్రవేశించడానికి దేవుడు అనుమతించాడా? ఒకడు సువార్తను విశ్వాసముతో సరైన విధంగా కలుపక మునుపు, వాడు మొదట దేవుని వాక్యమును వినవలెను, ఆ మీదట దాని యెడల తగిన విధంగా ప్రతిస్పందించు స్థాయికి చేరుకొనునంతగా దానిని విశ్వసించవలెను. సార్వత్రిక సిద్ధాంతము లేఖనానుసారమైనది కాదని, మనము ఈ వాక్యభాగమునుబట్టి తెలిసికొనుచున్నాము.

ఈ రోజుల్లో సువార్తను అనేకులు వింటున్నారు, సంఘారాధనలకు హాజరవుతున్నారు, అట్లయినను వారు ఎన్నడును సువార్తకు లోబడటంలేదు, గనుక సువార్త ద్వారా ప్రాప్తించు ప్రయోజనమును వారు పొందడంలేదు. ఒకడు వాని ముందుంచబడిన సౌభాగ్యమైన ఆహారమును ఆరగించక, చివరకు వాని ప్రాణం పోవునంతగా ఆకలితో అలమటించడం ఎంత విషాదాంతమైన విషయమవుతుంది కదా! సువార్త సందేశములను సంతోషముతో సంతృప్తిగా ఆరగించడానికి అవకాశములు అందుబాటులో ఉండి కూడ ఒకడు దానికి బదులుగా తన ఆత్మను చెత్తతో నింపుకొని తన ఆకలి తీర్చుకొనడం నిజముగా విచారకరమైన విషయమే. వినిన సువార్త విశ్వాసమును కలుగజేయడానికి శక్తిగలవై యున్నది; గనుక వినిన దాని ప్రకారమైన చర్య చేపట్టబడినప్పుడు, అది రక్షణ కలుగజేస్తుంది (రోమీయులకు 10:17; 6:17, 18).

**వచనము 3.** *విశ్వాసమును కొనసాగించవలెననునది మూడవ ఉత్తరువై యున్నది.* క్రైస్తవ నడక మన ప్రభువు మరియు ఆయన మనకిచ్చు సందేశములో మనముంచు మనఃపూర్వకమైన నమ్మకము చేత ప్రత్సాహింపబడుతుంది గనుక అది ఎదుగుచునే యుంటుంది.

మొదటి వచనం మనకు వాగ్దానము చేయబడిన విశ్రాంతి, అనగా, దేవుని విశ్రాంతి గూర్చి చెప్పుతున్నది. రెండవ వచనంలో ఆ విశ్రాంతి గూర్చిన సువర్తమానము ఇశ్రాయేలీయులకు వారు అరణ్యములో ఉండినప్పుడును, మనకును ప్రకటింపబడిందని చెప్పుతున్నది. మానవుడు ఆయన విశ్రాంతిలోనికి ప్రవేశించి, దానిని సమృద్ధిగా అనుభవించాలని దేవుడు ఎంతగానో ఆశించియుంటాడు, లేదంటే ఆయన అట్టి విశ్రాంతిని సిద్ధపరచేవాడే కాడు లేదా మానవులు అందులోనికి ప్రవేశించాలని ఆయన వారిని విన్నవించుకునేవాడే కాడు. మూడవ వచనం, సకల విశ్వాసులు, వారు నమ్మదగినవారైనట్లయితే, వాస్తవంగా **ఆ విశ్రాంతిలో ప్రవేశిస్తారనే** చాటింపై యున్నది. **విశ్వాసులమైన** అనే మాటలు భూతకాలంలో ఉన్నాయి; కాని "ప్రవేశించుచున్నాము" అనే మాటలు వర్తమాన కాలంలో ఉన్నాయి, గనుక "ఆయన ఆలోచించుచున్న ఆ విశ్రాంతి, సంబంధిత ప్రక్రియ అదివరకే నెరవేరుచున్న ఒక అనుభవమై యున్నదని" ఈ మాటలు సూచిస్తున్నాయి.[10]

"విశ్వాసులమైన మనము" అనే మాటలు వర్తమాన కాలమునకు

బదులుగా, భూతకాలంలో ఉన్నాయి, గనుక అవి అనివార్యముగా ఈ పత్రిక పాఠకులు క్రీస్తునంగీకరించుటను సూచిస్తుంది.[11] ఈ ప్రస్తావన క్రీస్తును ప్రభువుగా అంగీకరించినవారి గూర్చిన వర్ణనను పోలిన నమూనాయై యున్నది. అపొస్తలులు కార్యములు 2వ అధ్యాయం, యేసు అరోహణమైన అనంతరం పేతురు వారి నుద్దేశించి చేసిన ప్రసంగమును "స్వీకరించి" క్రీస్తును ప్రభువుగా మొదట అంగీకరించినవారిని వర్ణించుచున్నది. ఆ తరువాత వారు బాప్తిస్మమియ్యబడ్డారు (అపొస్తలుల కార్యములు 2:38–41). వారు యేసు నందు విశ్వాసముంచవలెనని ఫిలిప్పీ పట్టణంలోని చెరసాల అధికారి మరియు అతని కుటుంబము ఆదేశింపబడ్డారు (అపొస్తలులకార్యములు 16:31); ప్రభువు వాక్యము వారికి బోధింపబడిన మీదట, వారు వెంటనే బాప్తిస్మము పొందారు (అపొస్తలుల కార్యములు 16:33). వారు క్రీస్తునంగీకరించుట అనే విషయాన్ని ఒకడు "విశ్వాసించాడు" అనే విషయంగా పరిగణిస్తూ, ఇదే విషయానికి, దానిని విదితంగా పేర్కొనకుండానే, క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన చర్యను చేర్చడం సముచితమవుతుంది. రోమీయులకు 13:11లో, "మనము విశ్వాసులమైనప్పటి కంటె ఇప్పుడు రక్షణ మనకు మరి సమీపముగా ఉన్నదని" చెప్పుతూ పౌలు చివరి రక్షణ గడియల గూర్చి ప్రస్తావించాడు. రోమీయులకు 6:3–5లో పౌలు పరోక్షంగా ప్రస్తావించిన విధానంలో తన పాఠకులు విధేయులైనప్పుడు, వారు "క్రీస్తులోని బాప్తిస్మము" పొందారు గనుక వారి రక్షణ సమీపమయ్యింది. విశ్వాసముంచు చర్యలో విధేయతతో బాపీస్మము నిమిత్తము లోబడుట కలిసియున్నదనే విషయం మరొక పర్యాయం స్పష్టమవుతుంది, ఇది తద్వారా ఒకడు క్రీస్తులోనికి, అనగా సమస్త రక్షణ నిచ్చువానిలోనికి ప్రవేశించు విశ్వాసముతో కూడిన చర్యయై యున్నది.

తరువాతి పదజాలమునకు, KJV "వారు నా విశ్రాంతిలోనికి ప్రవేశించినట్లయితే" అని అర్థమిచ్చు మాటలు కలవు. ఇది గ్రీకు మాటలకు అక్షరార్థమై యున్నది, అయితే అది ఒక భాషకు విశిష్ఠమైన అర్థం కాదు. సాంప్రదాయికంగా, ఏదైన ఒక నిశ్చిత విషయం చేయబడదని చెప్పడానికి ఇదొక తీరై యుండింది. ఇదే తీరును దావీదు ప్రయోగిస్తూ, "సూర్యుడస్తమింపక మునుపు ఆహారమేమైనను నేను రుచి చూచినయెడల దేవుడు నాకు గొప్ప అపాయము కలుగజేయునుగాక" అని పలికాడు (2 సమూయేలు 3:35). సూర్యుడస్తమించు వరకు తాను ఏమియు పుచ్చుకొనడని దావీదు గంభీరమైన ఒక బాస చేసాడు. కాబట్టి, NASB అనువాదం ఉత్తమమై యున్నది: **వారు నా విశ్రాంతిలో ప్రవేశింపరు.**[12] రచయిత కీర్తనలు 95:11ల నుంచి ఉల్లేఖించి చెప్పుతున్నాడు, కాదేషు బర్నేయలో తిరుగుబాటుచేసిన వారు ఆయన విశ్రాంతిలో ఎన్నడును ప్రవేశింపరని ఆగ్రహము చెందిన దేవుడు ప్రమాణంచేసాడని అది సెలవిస్తుంది. యూదుల (కనాను) విషయంలో "విశ్రాంతి" అనేది నమ్మకమైవారి కోసం వేచియుంటున్న పరలోకమునకు నమూనాయై యున్నది; కాని మనము కూడ, మన పయనం యొక్క తుదమట్టుకు నమ్మదగినవారము కానట్లయితే, ప్రవేశింపకుండా నిలువరింపబడుదుము. దేవుడు "ప్రమాణము చేసిన" కాలము ఆ దినములకు వర్తించినది, అంత్య తీర్పు దినములకు కాదు. తీర్పు తీర్చు నిమిత్తము క్రీస్తు రాక మునుపటి ఎంతో కాలమునకు ముందే మనము మన నిత్య స్వాస్థ్యమును కోల్పోవుదుమనుట సరియే.[13]

అటుతరువాత రచయిత, **జగత్పునాది వేయబడినప్పుడే ఆయన కార్యములన్నియు సంపూర్తియై యున్నను** అని రాస్తున్నాడు. ఆయన చేపట్టిన సృష్టి

కార్యక్రమము సమాప్తియైనప్పుడు దేవుడు విశ్రమించాడు, మరియు అప్పటి నుంచి కూడా ఆయన విశ్రాంతిలోనే ఉంటున్నాడు. "పునాది" అని అనువదింపబడిన పదము, సర్వసాధారనమైన "సృష్టి" అని అర్థమిచ్చు *ktisis* అనే పదమునకు బదులుగా, *katabolē* అయియున్నది. "జగత్పునాది" (*katabolēs kosmou*) అనే వ్యక్తీకరణము క్రొత్త నిబంధనలో సృష్టి క్రమము సూచింపబడు ప్రతిసారి ప్రయోగింపబడుతుంది.[14]

**వచనము 4.** అటుతరువాత రచయిత ఆదికాండము 2:2ను ఉల్లేఖించి చెప్పాడు: **మరియు దేవుడు ఏడవ దినమందు తన కార్యములన్నిటిని ముగించి విశ్రమించెను.** అనగా, సృష్టిజాలమంతటిని సృజించుటనుబట్టి దేవుడు అలసిపోయాడు కాబట్టి ఆయన విశ్రాంతి తీసికొనాల్సిన అవసరం ఏర్పడిందనేది దీని అర్థం కాదు. ఆయన విశ్రాంతి మొత్తానికే తీసికొనబడుతున్న విశ్రాంతి కాదు, ఎందుకనగా నా తండ్రి యిదివరకు పనిచేయుచున్నాడని యేసు సెలవిచ్చాడు (యోహాను 5:17). దేవుడు యింకను ఈ ప్రపంచమంతటిని పర్యవేక్షిస్తున్నాడు మరియు దీవెనలు సమకూర్చడానికని దైవికంగా, అది దేవదూతల ద్వారా కావచ్చు, తన పనులు తాను చేస్తూనే ఉన్నాడు (రోమీయులకు 8:28 చూడుము). కాబట్టి, సబ్బాతు అనగా ఆ దినాన సంపూర్తిగా పనులేమియు చేయకుండా ఉండిపోవుట కాదు, కాని "అంతకు మునుపటి ఆరు దినముల సాధారణ పనులన్నింటిని ఆపుజేయుట" అని అర్థం.[15] సబ్బాతు దినాన యేసు స్వస్థపరచడం ద్వారా ఆయన చేసిన పని, అది దేవుని సొంత పనై యుండింది, అది కనికరముతో కూడినదై యుండింది (యోహాను 5:16, 17). మానవుడు నేను చేసిన పనుల్లో ఉత్కృష్టమైన సాదింపై యున్నాడన్నట్టుగా, దేవుడు మానవుని సృజించిన తరువాత మిగిలిన సృష్టిజాలమును సృజించడమును నిలిపివేసాడు. నా పోలికను ధరించినది, నాతో కూడ సహవాసము చేయగలది, మరియు స్వతంత్రముగా నున్న ఆత్మ ఒకటి బయలుదేరవలెను అనేది సుదీర్ఘమైన ఈ ప్రక్రియ లక్ష్యమై యున్నది.[16]

ఐగుప్తు దేశంలో నుంచి లభించిన వారి విడుదలకు స్మారక చిహ్నంగా యూదులకు "సబ్బాతు దినమునాటి విశ్రాంతి" ఏర్పాటు చేయబడింది (ద్వితీయోపదేశకాండము 5:15). విశ్రాంతి దినమును ఆచరింపవలెనను ఆజ్ఞ దేవుడు ఏడవ దినమందు విశ్రమించిన విషయాన్ని కూడ గుర్తుచేసింది. ఏది ఏమైనా, విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞ నైతిక నియమము కాబట్టి అది ఎల్లప్పుడు ఆచరింపబడాల్సిందే అని సబ్బాతు దినాచారమును పాటించువారు స్వాధికారంతో చెప్పేదానికి లేఖనాధారాలు లేవు. ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశపు బానిసత్వంలో నుంచి విడిపింపబడిన విషయాన్ని జ్ఞాపకం చేసుకొనుట, ప్రతి వారము ఆచరింపబడు విశ్రాంతి దినాన ప్రాథమికంగా చేయబడాల్సిన పనైయుండినదని ద్వితీయోపదేశకాండము 5:14, 15లోని వాక్యభాగము సెలవిచ్చుచున్నది. ఇంతేగాక, దేవుడు సీనాయి పర్వతముపై "పరిశుద్ధమైన [ఆయన] విశ్రాంతి దినమును ఆచరింప ఆజ్ఞ ఇచ్చెనని" నెహెమ్యా 9:13, 14 సూచించుచున్నది. ఈ విషయాన్ని దేవుడు వారికి సీనాయి పర్వతముపై తెలియజెప్పియున్నట్లయితే, అది ఏదెను తోట సందర్భము నాటి నుంచి కూడ అమలు చేయబడుచుండిన ఆజ్ఞయై యుండదు.

**ఆయన యొక చోట చెప్పియున్నాడు** అని గ్రంథకర్త రచిస్తున్నాడంటే, అవి ఎక్కడ వ్రాయబడి ఉన్నాయో ఈ పత్రిక రచయితకు తెలియదనేది ఈ మాటల అర్థం కాదు, కాని అది సర్వసాధారణంగా తెలిసిన వాంగ్మూలమై యుండి, "మనకు తెలిసినట్టుగా" లేక

"సుపరిచితమైన మాటలు ఉల్లేఖింపబడుటకు" అనే అర్థమిచ్చుచుండింది.[17]

మన విశ్రాంతిని తప్పింపోకుందునట్లు మనము సకల విధాల ప్రయాసపడాల్సి వున్నది. భయము కలిగియుందాము, వాక్యమును అంగీకరించి, దాని వలన ప్రయోజనమును పొందుదాము, మన విశ్వాసమును కొనసాగించుదాము. ఈ మూడు ఉత్తరువులను మనము జాగ్రత్తగా పాటించినట్లయితే, మనకు ఇప్పుడు దేవుని సమాధానము మరియు ఆయన విశ్రాంతి – ఆయన నిత్య సమాధానము – నిత్యత్వమందు మనకు లభించును.

సబ్బాతు దిన విశ్రాంతి నిలిచియుంటుంది (4:5–11)

**5ఇదియుగాక ఈ చోటుననే**
**–వారు నా విశ్రాంతిలో ప్రవేశింపరు**
**అని చెప్పియున్నాడు.**
**6–7కాగా ఎవరో కొందరు విశ్రాంతిలో ప్రవేశించుదురను మాట నిశ్చయము గనుకను, ముందు సువార్త వినినవారు అవిధేయతచేత ప్రవేశింపలేదు గనుకను, నేడు మీ రాయన మాట వినినయెడల మీ హృదయములను కఠినపరచుకొనకుడి వెనుక చెప్పబడినప్రకారము, ఇంత కాలమైన తరువాత దావీదు గ్రంథములో – నేడని యొక దినమను నిర్ణయించుచున్నాడు.**
**8యెహోషువ వారికి విశ్రాంతి కలుగజేసినయెడల ఆ తరువాత మరియొక దినమునుగూర్చి ఆయన చెప్పకపోవును. 9కాబట్టి దేవుని ప్రజలకు విశ్రాంతి నిలిచియున్నది. 10ఎందుకనగా**
**దేవుడు తన కార్యములను ముగించి విశ్రమించిన ప్రకారము, ఆయనయొక్క విశ్రాంతిలో ప్రవేశించినవాడు కూడ తన కార్యములను ముగించి విశ్రమించును. 11కాబట్టి**
**అవిధేయతవలన వారు పడిపోయినట్లుగా మనలో ఎవడును పడిపోకుండ ఆ విశ్రాంతిలో ప్రవేశించుటకు జాగ్రత్త పడుదుము.**

**వచనములు 5–7.** వారు వాగ్దానము చేయబడిన విశ్రాంతిలోనికి ప్రవేశింపలేకపోయినందుకు, ఇశ్రాయేలీయులు ఇతరులనుగాక తమ్మునుతానే నిందించుకొనాల్సి వుండింది – వారి సొంత వ్యక్తిగత అవిధేయత వలననే వారు ప్రవేశింపలేకపోయారు. కీర్తనలు 95:11లో నుంచి ఉల్లేఖింపబడి హెబ్రీయులకు 3:4లో పేర్కొరనబడుచున్న హెచ్చరిక, ఉద్ఘాటన కోసం హెబ్రీయులకు 4:5, 6లో పునఃరుక్తం గావింపబడింది. యువతరం, కనాను దేశంలో ప్రవేశించినందు వలన ఆ మాటలు ఇచ్చట పేర్కొనబడలేదు, ఏలయనగా రచయిత నొక్కివక్కాణింప దలచిన విషయం అది కాదు.

కీర్తనలు 95లో పేర్కొనబడిన **విశ్రాంతి,** యెహోషువ నాయకత్వంలో సంపాదించుకొనబడినట్లు వాగ్దానము చేయబడిన దేశమును గూర్చిన ప్రస్తావన కాదనే విషయాన్ని మనము గమనిస్తాము, ఏలయనగా కాగా ఎవరో కొందరు విశ్రాంతిలో ప్రవేశించుదురు అనే మాటలను కీర్తనకారుడు వ్రాయక **మునుపటి ఎంతో కాలం క్రితమే** ఇశ్రాయేలు ప్రజలు కనాను దేశంలో ప్రవేశించారు. దేవుడు ఏ విషయాన్నైనను వ్యర్థంగా వాగ్దానం చేయడు; కాబట్టి, కొందరు కనాను దేశంలో ప్రవేశించాల్సి వుండింది, మరికొందరు "తప్పనిసరిగా" (KJV)[18] పరలోకంలోనికి ప్రవేశించాల్సి వుండింది. దేవుని వాక్యము నిరర్థకముకానేరదు (యోహాను 10:35). మన దేవుడు ఎన్నడును విఫలము కాలేదు,

మరియు ఆయన వాక్యము ఎన్నడును నెరవేరకుండా తప్పిపోలేదు; అయితే పరిమితమైన మన దృష్టికి అప్పుడప్పుడు అది అనిపిస్తుంది, అగుపిస్తుంది.

ఒకడు క్రైస్తవుడైన తరువాత కూడ, వాడు ప్రదర్శించు అవిధేయత, వాడు పరలోకంలో ప్రవేశింపవలెనను వాని లక్ష్యమును విఫలము చేయగలదు, కాని ఆయన యెడల విశ్వసనీయమైనవారుగా ఉండు వారి విషయంలో అది దేవుని ఉద్దేశ్యమును ఎన్నడును విఫలము చేయదు.[19] అంతిమ నష్టం గూర్చి ఆయన ఎన్నడైనను ఆందోళనచెందాల్సిన అవసరం ఆయనకు లేదు ఎందుకనగా అంతమనేది ఆయనకు ఆది నుంచే తెలియును, మరియు అంతిమ విజయం ఆయనదే అని కూడ ఆయనకు తెలియును. ఆయనకు చెందినవారు ఆ విజయంలో పాలుపంచుకొందురు (ప్రకటన 17:14).

సమస్త చరిత్రను, సముచితమని ఆయన అనుకున్న సమయంలో సమాప్తము చేయడానికి దేవుడు ఎల్లవేళందు తన సత్కార్యములను కొనసాగిస్తూనే ఉన్నాడు. విశ్వసనీయమైనవారు ఎల్లప్పుడు పరిమితమైయున్న ఈ పరలోకమునకు ఆవల నున్న పరలోక విశ్రాంతి కోసం చూచుచుందురని హెబ్రీ పత్రిక చూపిస్తుంది (11:13–16; 13:14). వాస్తవంగా మనకు తెలిసియున్న దాని కంటె మనకు ఎక్కువే తెలుసునని మనము అనుకొనడం, మన ఆలోచనలలో అగుపించే ప్రాణహానికరమైన లోపమై యున్నది. మనము భవిష్యత్తును చూడలేము, దాని గూర్చి చెప్పలేము, కాబట్టి మన తెలివి పరిమితమైనదై యున్నది.

దేవుడు మరియు మానవుడు కలసి మాటలాడుచున్నారు. **ఆయన** అనే మాట దేవుడు ఆ దినమును ఏర్పాటు చేయుచున్నాడని సూచించవలెను, కాని ఇది **దావీదు ద్వారా** చేయబడింది. ఇవి దావీదు మాటలై ఉన్నాయి, కాని "మాటలాడుచున్న వాడు వారి ద్వారా మాటలాడు దేవుని **ఆత్మ**యై యున్నాడు."[20] దావీదు దేవుని చేత ప్రేరేపింపబడినాడని ఇది మరొక పర్యాయం రూఢిపర్చుచున్నది.

**వచనము 8. యెహోషువ వారికి విశ్రాంతి కలుగజేసిన యెడల** అనే మాటలతో, ఈ వచనము మొదలవుతుంది. KJVలో "యెహోషువ"కు బదులుగా "యేసు" అని వ్రాయబడి యున్నది. పాత నిబంధన యొక్క హెబ్రీ భాషలోని మూల గ్రంథ పాఠంలో "యెహోషువ" అనే పేరున్నది, ఈ పేరు గ్రీకు బాషలో "యేసు"నకు సమానమైనది. "ప్రభువు రక్షిస్తాడు" అనే అర్థమిచ్చు నామము, ఈ రెండు నామములకును వర్తింపజేయబడవచ్చు. ఈ విషయం తెలిసికొని, 1611 నాటి పండితులు చేతి రాత ప్రతులలో వారు కనుగొన్నట్టుగానే, అక్షరార్థమైన గ్రీకు పదమును ("యేసు") ప్రయోగించడానికి ఎక్కువ మక్కువ చూపారు. గందరగోళమును దూరం చేయడానికి, అందరు కాకపోయినా, అధిక సంఖ్యాకులు, ఆధునిక అనువాదకులు ఈ పదమును "యెహోషువ" అని అనువదిస్తుంటారు.[21] మూల గ్రంథ పాఠమును చదువుచుండిన పాఠకులు, ఈ వాక్యభాగములోని నమూనా మరియు మూల నమూనాలలోగల అంతస్సూచనలను – పాత నిబంధనలోని యెహోషువ క్రొత్త నిబంధనలోని "యెహోషువ"కు (యేసునకు) నమూనాయై యుండునని – వెనువెంటనే గుర్తించియుందురు. అట్లయినను, యెహోషువ, పాత నిబంధనలోని "యేసు," క్రొత్త నిబంధనలోని "యెహోషువ" అనగా యేసు, సమకూర్చు విశ్రాంతిని సమకూర్చలేకపోయాడు. హెబ్రీ భాషలోను, లేఖనములలో మరొక చోటను గల ఈ విధమైన పదకేళి, వర్తమానకాల పాఠకులు ఈ నామములనే పట్టుకొని వ్రేలాడునట్లు వారిని నడిపించకూడదు.

యెహోషువ 22:4, దేవుడు ఇశ్రాయేలీయులకు వాగ్దానము చేసిన విశ్రాంతిని ఆయన వారికిచ్చాడని సెలవిచ్చుచున్నది. యెహోషువ, వారి పితరులను కనాను దేశంలోనికి నడిపించడం ద్వారా, విశ్రాంతికి సంబంధించిన వాగ్దానమును నెరవేర్చాడని కొందరు ప్రాచీన యూదులు తర్కించియుందురు. ఏది ఏమైనా, యెహోషువ కాలము గడిచిపోయిన నాలుగు వందల సంవత్సరముల తరువాత కూడ మరొక విశ్రాంతి యింకను పొందబడలేదని దావీదు చెప్పుచున్నాడు. కీర్తనలు 95:7–11లోని వాక్యభాగము దావీదు దినములలోని అవిశ్వాసము గూర్చి ప్రజలను హెచ్చరించింది, గనుక హెబ్రీ పత్రిక రచయిత కూడ ఈ వాక్యభాగములోని ఉల్లేఖనమును తన కాలము నాటి ప్రజలకు అన్వయింపజేయాలని ఆశించాడు. ఈ హెచ్చరిక ప్రస్తుత కాలమునకు సహితం వర్తిస్తుందని ఈ పత్రిక రచియిత యొక్క ప్రయోగము తెలియజెప్పుచున్నది. కాబట్టి, 8 మరియు 9 వచనములు, **మరొక దినము** మరియు మరొక విశ్రాంతిని గూర్చి చెప్పుచున్నవని స్పష్టమవుతుంది.

**వచనము 9.** విశ్రాంతికి సంబంధించిన అభయం **దేవుని ప్రజల కొరకు** మాత్రమే ఉద్దేశింపబడినదై యుండినది. పాత నిబంధనలోని ఇట్టి అభివ్యక్తము యూదులను మాత్రమే సూచించింది, కాని క్రొత్త నిబంధనలో ఇది సమస్త క్రైస్తవులకు వర్తిస్తుంది.

9వ వచనంలోని సబ్బాతు విశ్రాంతి అనే పదజాలము *sabbatismos* అయియున్నది, ఇది క్రొత్త నిబంధనలో ఇచ్చట మాత్రమే కనబడుతుంది. వాస్తవానికి, ఈ గ్రీకు రచనలకు ముందు ఇది మరెచ్చటను కనుగొనబడలేదు.[22] *Sabbatismos* యొక్క ప్రయోగం ఇదొక్కటి మాత్రమే అయినప్పటికిని, *sabbatizein* అనే సహజాతీయ క్రియా పదము LXXలో తరచుగా అగుపిస్తుంది. ఈ మాట హెబ్రీయుల కోసం నూతనంగా సృష్టింపబడిందనే అభిప్రాయమును కొట్టివేయవచ్చు ఎందుకనగా ఇదే మాట Plutarch (c. క్రీ.శ. 46-120) అనే అన్యమతారాధికుడైన రచయిత చేత ఉపయోగింపబడింది.[23] "ఈ పాపిష్ఠి మరియు విసుగుపుట్టించే జీవితంలో ఎదురయ్యే సమస్త కష్టాలు, కలతల నుంచి" ఉపశమనమును కలుగజేయడానికి దేవుడు ఆదర్శప్రాయమైన విశ్రాంతిని సిద్ధపరచి యున్నాడని ఈ పదము మనకు తెలియజెప్పుచున్నది.[24]

మనము ఈ జీవితంలో అధికారికమైన సబ్బాతు విశ్రాంతిని ఆచరింపకపోయినప్పటికిని, మనకు నిత్యత్వంలో ఒక విశ్రాంతి ఉంటుంది. ఇది, ఆదర్శవంతమైన పాపములేని పరిస్థితిలో దేవుడాశించు విశ్రాంతియై యుంటుంది. మత్తయి 11:28–30లో క్రీస్తు ఇచ్చిన వాగ్దానములో దీనికి సంబంధించిన పూర్వానుభవమును మనము ఇదివరకే కలిగియున్నాము. సృష్టిని సృజించుచుండిన పనుల నుంచి మాత్రమే దేవుడు విశ్రమించాడు కాబట్టి, మనకిప్పుడు ఎరుకలేని కార్యక్రమాల్లో నిమగ్నమై యుండి మనము నిత్యత్వమును గడుపవచ్చునని భావించడం సహేతుకమవుతుంది. అట్లయినప్పటికిని, ఈ జీవితంలో ఎదురయ్యే సమస్త కష్టాలు, కలతల నుంచి క్రైస్తవులు ఇచ్చట కలిగియున్న దానిని మించిన "విశ్రాంతి" పరలోకంలో ఉంటుంది. దేవుని రాజ్యములో ఉండువారికి మాత్రమే ఈ దీవెనలు లభిస్తాయి (కొలొస్సయులకు 1:13, 14).

**వచనము 10.** ఈ వచనంలో ఆయన యొక్క విశ్రాంతిలో ప్రవేశించినవాడు అనే మాటలున్నాయి. KJVలో వ్రాయబడిన మాటలు కొంచెం భిన్నంగా ఉండవచ్చు: "ఏలయనగా ఆయన యొక్క విశ్రాంతినిలోనికి ప్రవేశించినవాడు." ఇచ్చటి "ఆయన"

అనే మాట ప్రభువైన యేసును సూచించడంలేదు; కాని విశేషంగా, "ఒకడు" (NASB) అనే మాట ధ్వనిస్తున్నట్టుగా, ఈ లోకమును విడిచి ఆయన విశ్రాంతిలో ప్రవేశించిన ప్రతి పరిశుద్ధుడు అని అర్థమిస్తుంది (ప్రకటన 14:13). ఆయన ఈ లోకంలో ఉన్నప్పుడు చేసిన విధంగా (యోహాను 9:4 చూడుము),[25] క్రీస్తు తన పనులు చేయడమును ఆపుజేయలేదు, కాని సింహాసనము యెదుట మన కొరకు విజ్ఞాపనములు చేయుచునే యున్నాడు (హెబ్రీయులకు 7:25). "సమాప్తమైనది" అనే ఆయన కేక (యోహాను 19:30) ఆయన యొక్క ఇహలోక పనుల సమాప్తిని సూచించినది, ఆయన యొక్క పరలోక సంబంధమైన ప్రయాసములను కాదు. అదే విధంగా, క్రీస్తునందు మృతినొందినవారు నిశ్చయంగా వారి సకల కార్యకలాపములను మానివేయలేదు. మృతులైన నీతిమంతులు దేవుని మహిమ గీతములను గానం చేస్తున్నారని ప్రకటన గ్రంథం చిత్రీకరించుచున్నది. ప్రకటన 5:8, 9లో నాలుగు జీవులు మరియు ఇరువది నలుగురు పెద్దలు క్రొత్త పాట పాడుచుందురని చెప్పబడి యున్నది; నూట నలువది నాలుగువేల మంది పాడుదురని 14:3 చెప్పుచున్నది; 15:2, 3లో "ఆ క్రూరమృగమును మరియు దాని ప్రతిమను జయించినవారు" మోషే కీర్తనయు గొఱ్ఱెపిల్ల కీర్తనయు పాడుచున్నారని చెప్పబడి యున్నది.

పరలోకంలో చురుకుదనం లేకుండా ఒక "ఆత్మ నిద్రించుట" గూర్చినది బైబిలు సంబంధమైన నిదర్శనము ఏదియు లేదు. లాజరు మరణించినప్పుడు "అబ్రాహాము రొమ్మున" (ఆనుకొనుటకు) "లోనికి" (*eis*) అతడు అక్షరాలా కొనిపోబడ్డాడని సోదాహరణంగా చిత్రీకరింపబడి యున్నది (లూకా 16:22). అతడు అచ్చట ఏంచేసాడో పేర్కొనబడలేదు, కాని అబ్రాహాము రొమ్మున ఆనుకొని, లాజరు ఏ పనులనైనను చేయకుండా బొత్తిగా నిద్రించుచునే యుండుననే విషయంలో అర్థముండదు. పశ్చాత్తాపపడిన సిలువ మీది దొంగ అదే దినమున పరలోకమును అనుభవించునని యేసు పలికాడు (లూకా 23:43). ధన్యకరమైనదని ధ్వనింపునిచ్చు ఆ ప్రదేశంలో బొత్తిగా ఎటువంటి కార్యకలాపమైనను ఉండనట్లయితే, అచ్చటికి పయనమై వెళ్లడంలో యిక ప్రయోజనమేముంటుంది! అట్లయినను, జీవితములో ఎదురయ్యే చింతలు మరియు ప్రయాసముల నుంచి స్వతంత్రం లభిస్తుందని ఇవి మరియు ఇతర వాక్యభాగములు సూచించుచున్నవి. Albert Barnes ఇలా సూచిస్తున్నాడు, "మన సమస్త ప్రయాసములు అంతమవుతాయి. అలసి సొలసిపోయినవాడు వాని భారమును దింపుకుంటాడు; నిస్సత్తువ చేత నీరసించిన బలహీనుడు యిక మీదట అలుపెరుగడు."[26] నిశ్చయంగా, నిత్య విశ్రాంతి, మహిమలో దేవునికి పరిచారము చేయబడుటలో నిమగ్నమైన సమయమవుతుంది, కాని అది విశ్రాంతి కొరకైన వాంఛను సహితం నెరవేరుస్తుంది.

**వచనము 11.** దేవుని **విశ్రాంతి** చివరిసారిగా పేర్కొనబడటంతోపాటు, ఈ వచనం ఒక చివరి మందలింపును ఇచ్చుచున్నది. పరలోకము లోనికి **ప్రవేశించడానికి** ప్రయాసపడవలసి యుంటుంది, ఏలయనగా శ్రద్ధ లేకుండా ఒకడు దానిలోనికి ప్రవేశింపజాలడు. బలమైన **విన్నపము** జాగ్రత్తపడుదము (*spoudazō* నుండి) అని అనువదింపబడింది, అనగా "మనఃపూర్వకంగా ప్రయాసపడుము, మీ సావధానమును నిలిపియుంచుము, త్వరపడుము, నిన్ను నీవు ఒత్తిడిచేసుకొనుము, అన్ని విధాల ప్రయాసపడుము, అమితాసక్తిగలవారై యుండుము" అని అర్థం.[27] ఇదే పదము 2 పేతురు 1:10లో, "మరి జాగ్రత్తపడుడి" అని అనువదింపబడింది. నిజముగా ఇరుకు

మార్గములో ప్రవేశించడం కష్టమే; కాని లూకా 13:24లో, రక్షణ మార్గములో ప్రవేశించుట గూర్చి ప్రయోగింపబడిన పదము *agōnizomai* అయియున్నది, అనగా ప్రవేశించడానికి అత్యంత మనఃపూర్వకంగా ప్రయాసపడవలెనని అది సూచించుచున్నది. లూకా సువార్తలో వ్రాయబడిన మాట ప్రకారం, హెబ్రీయులకు 4:11లో వ్రాయబడిన "జాగ్రత్తపడుదము" అనే మాట కంటె ఎక్కువ ప్రయాసం అవసరమవుతుందని అర్థమవుతుంది. హెబ్రీయులు ఇరుకు మార్గంలో నిలిచియుండుటకు కలిగిన కష్టము కంటె ఎక్కువ, అన్యజనులు ఇరుకు మార్గంలో ప్రవేశించడంలో కలుగుతుందా? ఈ భావమే ధ్వనించవచ్చు, కాని కనీసం "ఆకాశ మహాకాశములోనికి పూల పానుపుల మీదనైనా మోసికొనిపోబడవలెనని" మనము ఆశించజాలము, విశేషంగా, "మనము పరిపాలించవలెనంటే, పోరాడవలసిందే."[28] ప్రమాదవశాత్తు పరలోకంలో ప్రవేశించడమనేది ఉండదు.[29] మనము ప్రయాసపడుచుందుము ఎందుకనగా నిత్య విమోచన యొక్క బహుమానము ఎంతో మహిమాన్వితమైనదై యున్నది, మరియు అద్దానిని కోల్పోవుట బహు గొప్పది మరియు భయంకరమునై యున్నది.

"జాగ్రత్తపడుదము" అని బ్రతిమలాడుచున్నప్పటికినీ, అనేక మంది వ్యాఖ్యానకర్తలు ఈ ఆలోచనను అదనంగా చేర్చుతున్నారు: "కాని అది క్రియల వలన సాధింపబడుతుందని మనము ఊహించుకొన కూడదు."[30] ఏ విధేయత లేదా మానవ ప్రయాసమైనను, అది విశ్వాసముతో చేపట్టబడినదైనను, ఈ అదనపు హెచ్చరికగలదై యుండవలెనని కొందరు భావిస్తుంటారని స్పష్టమవుతుంది: "నీవు పరలోకం వెళ్లడానికి ఇది నీకు సహాయకరమవుతుందని అనుకోవద్దు!" ఏదైనాగాని మన ప్రయాసము మీదనే ఆధారపడి యుంటుందని మనము అనుకున్నట్లయితే, అది మన రక్షణను క్రియలతో కూడిన పద్ధతిగా చేస్తుందనేది వారి అభిప్రాయమై యున్నది. ఇది కేల్విన్‌కు సంబంధించిన బోధల పరిణామమై యున్నది. రక్షణ పొందడానిరి సమస్త "క్రియలు" అనవసరమైనవనే విషయంలో ఎఫెసీయులకు 2:8, 9 మరియు రోమీయులకు 3:27–4:8 తరచుగా ప్రస్తావింపబడు వాక్య భాగాలై ఉన్నాయి.

మనము మన విశ్వసనీయతను కొనసాగిస్తూనే ఆ తరువాత రక్షణ కోసం ఏ క్రియలైనను అవసరముండుటను కాదనడానికి జాగ్రత్తపరులమై ఉండాలని ఒకడు ఎలా గుర్తించగలడు? రోమీయులకు 3:28లో వినాయింపబడిన క్రియలు, "ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలై" ఉన్నాయి, అనగా, మోషే ధర్మశాస్త్రము. ఎఫెసీయులకు 2:8, 9లో వినాయింపబడిన "క్రియలు" నిశ్చయంగా ప్రశంసాయోగ్యమైన క్రియలు కూడా అయియున్నవి, కాని ఇది విశ్వాసమునుబట్టి లోబడవలసిన అవసరతను తీసివేయదు. రక్షణ మనకొక వరమై యున్నది, "అంతేగాని అది మన క్రియల వలన కలిగిన ఫలితము కాదు, గనుక ఎవడును అతిశయపడ వీలు లేదు" (ఎఫెసీయులకు 2:9). విశ్వాసముతో కూడిన క్రియలో లేదా వాని మారుమనస్సునుబట్టి ఎవడైనను ఎప్పుడైనను అతిశయించెనా? కొందరు అతిశయించి యుండవచ్చు, కాని ఇలా అతిశయించడం అరుదుగా సమర్థింపబడుతుంది ఎందుకనగా దానిని అనుమతించుటకు తన రక్తము ద్వారా క్రీస్తు ఒక తరుణమును సమకూర్చనట్లయితే ఈ రెండు విధములైన చర్యలలో ఏదియు మనకు రక్షణను తెచ్చిపెట్టదు. విశ్వాసమే ఒక "క్రియ" అని యేసు సెలవిచ్చాడు (యోహాను 6:28, 29 చూడుము), కాని ఇట్టి క్రియ రక్షణను సంపాదించుకోడానికి ప్రయోజనపడదు.

"కాలము నెరిగి, నిద్రమేలుకొను వేళయైనదని తెలిసికొని, అలాగు చేయుడి; మనము విశ్వాసులు మైనప్పటి కంటె ఇప్పుడు, రక్షణ మనకు మరి సమీపముగా ఉన్నదని" రోమీయులకు 13:11 ప్రకటించుచున్నది. "[ఈ క్రైస్తవులు] విశ్వాసులై యున్నప్పటి కంటె" అనే మాటలు వారు ప్రభువునంగీకరించిన కాలమును సూచింపవచ్చు. ఆ కాలంలో, వారి "విశ్వాసము"లో, వారు "క్రీస్తు లోనికి" బాప్తిస్మము పొందుట కలసియుండింది, ఈ విషయాన్ని పౌలు వారికి ఇదివరకే గుర్తుచేసాడు (రోమీయులకు 6:3, 4). వారు ఆనాడు చేపట్టిన చర్య వారు ప్రభువునంగీకరించిన విషయాన్ని అపొస్తలుల కార్యములు 2వ అధ్యాయం తరువాత ఇతరులు ప్రభువునంగీకరించిన విషయలతో సామరస్యంగలదానిగా చేసింది.

మన రక్షణకు అవసరమై యుండిన వాటిలో నుంచి వినాయింపబడిన చర్యలు నీతిమత్వారోపణకు సంబంధించిన ఏ విధానం విషయంలోనైనను ప్రశంసాయోగ్యమైన క్రియలై ఉన్నాయి, ఏలయనగా ఇందునిమిత్తము ధర్మశాస్త్రమునకు పరిపూర్ణంగా లోబడాల్సిన అవసరముంటుంది. ఒకడు పరిపూర్ణంగా జీవించగలిగినట్లయితే, అప్పుడు వాని క్రియలు వాని రక్షణను "సంపాదించవచ్చు." ఏది ఏమైనా, యేసు మినహాయిస్తే, ఏ ఒక్కరైనను, అంతటి పరిపూర్ణమైన జీవితం ఎప్పుడైనను జీవించియుండలేదు. మనవిషయంలోనైతే, ఇటువంటి రక్షణ అసాధ్యం. మరొక ప్రక్క, లోబడుచుండు విశ్వాసముతో కూడిన క్రియలు, మనము క్రీస్తునకు వెలుపల ఉన్నప్పుడు చేసిన పాపములకు సంబంధించిన అపరాధిత్వ భావం నుంచి ప్రాథమిక విమోచనను పొందు విషయంలోను, మన రక్షణను నిర్వహించు విషయంలోను అవసరమవుతాయి.

మనము ఇశ్రాయేలీయుల మాదిరి నుంచి నేర్చుకొనవలసి యున్నది. హెబ్రీ పత్రిక రచయిత, పాత నిబంధనను ఎల్ల కాలములకు సరిపడు సరైన నీతినియమములతో కూడిన ప్రవర్తనకు సంబంధించిన ఉదాహరణములతో నిండిన ఒక పుస్తకంగా ఉపయోగించుకున్నాడు. 1 కొరింథీయులకు 10:1–12లో పౌలు చేసిన పని కూడ ఇదే, ఇశ్రాయేలీయుల చెడు ప్రవర్తన ఆధారంగా ఈ పాఠమును ఉపదేశిస్తున్నాడు: మన రక్షణ విషయమై మనము నిశ్చయపరులమై యున్నామని మనము అనుకున్నట్లయితే, మనము పడకుండునట్లు "జాగ్రత్తగా చూచుకొనవలెను" (వచనము 12). "మీరు విశ్వాసముగలవారై యున్నారో లేదో, మిమ్మును మీరే శోధించుకొని చూచుకొనుడని" కూడ పౌలు రచించాడు! (2 కొరింథీయులకు 13:5). ఈ పద సముదాయము హెబ్రీయులకు 4:11లో వ్రాయబడిన, **ఎవడును పడిపోకుండ** అనే మాటలవంటివై యున్నవి. **ఇదే ఉదాహరణము** (*hupodeigma*, "నమూనా" లేక "నకలు" అని అర్థం) అనే అభివ్యక్తము పాత నిబంధన మరియు క్రొత్త నిబంధన కూడా మనకు కావలసినన్ని ఉదాహరణములతో నిండియున్నవని మరొక పర్యాయం చిత్రీకరించుచున్నది. మన విశ్వాసము బలహీనం కాకూడదనియు, అది విడిచిపెట్టబడ కూడదనియు ఈ సందర్భంలో ఒక చెడు ఉదాహరణము మనలను హెచ్చరించుచున్నట్లు గమనిస్తున్నాము. 2 పేతురు 2:6లో సొదొమ మరియు గొమొఱ్ఱా పట్టణముల గూర్చి చెప్పబడుచున్న సందర్భములో "దృష్టాంతము" అనే పదము ప్రయోగింపబడింది. ఈ పట్టణములు యింకను భక్తిహీనమైన జీవితము జీవించువారి మీదికి రానైయున్న నాశనమునకు దృష్టాంతముగా నిలుచుచున్నవి. బైబిలే, మొత్తంగా,

మనము ఎలా జీవించాలి, ఎలా జీవించకూడదో తెలియజెప్పు ఉదాహరణములతో కూడ కొనసాగుచున్న మాదిరియై యున్నది. అనగా, "లేఖనములలో ఒక మాదిరి అధికారం లేదని" చెప్పుకొనడం, దైవికమైన వెల్లడింపు యొక్క స్వభావమునే గ్రహించకపోవడమవుతుంది.

మనము చనిపోగానే నిత్య పరలోకంలోనికి వెంటనే ప్రవేశించనట్లయితే, అప్పుడు కూడా మనము ఒక "విశ్రాంతి"లోనికి ప్రవేశిస్తామనేది నిజమగుట సంభావ్యమే. మనము చనిపోగానే పరలోకములోని నేరుగా ప్రవేశించినట్లయితే, అప్పుడు లూకా 16:19–31లో యేసు, ధనవంతుడు మరియు లాజరు గూర్చిన దృష్టాంతమును ఇచ్చిన విధంగా యేసు ఉపదేశం, లేదా పరిస్థితి బహు గొప్పగా మారిపోయి యుంటుంది.

క్రైస్తవుల కొరకైన దేవుని వాక్యము (4:12, 13)

**[12]ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండచులుగల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు హృదయముయొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది. [13]మరియు ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు. మనమెవనికి లెక్క యొప్ప చెప్పవలసియున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తము మరుగులేక తేటగా ఉన్నది.**

4:4–11లో గల మందలింపు 12 మరియు 13 వచనములలో ఉన్నట్టు దేవుని వాక్యమును పట్టించుకొనకపోవడం ఒక గంభీరమైన పొరపాటని తెలియజెప్పు వాంగ్మూలముతో ముగియుచున్నది. అది ఎందుకు పొరపాటవుతుందనగా, అది దేవునినే లెక్కచేయకపోవడమవుతుంది. 12వ వచనంలోని "వాక్యము" అనే మాట, దేవుని వాక్యమై యున్నదని – అది కీర్తనలు 95లో పేర్కొనబడినట్లుగా పలుకబడినదైనా, లేదా లిఖితపూర్వకమైనదైనా – సందర్భానుసారమైన సంబంధం సూచించుచున్నది, ఏలయనగా "'లిఖితపూర్వకమైన లేఖనము' దేవుని వాక్యము" అని పిలువబడుచున్నది.[31]

12వ వచనంలోని నాలుగు గ్రీకు క్రియావిశేషణములు గమనార్హమైనవై ఉన్నాయి: "సజీవమై," "బలముగలదై," "దూరుచు," "శోధించునది." బైబిల్, దేవుని "సజీవమైన" వాక్యమై యున్నది, ఏలయనగా అది దేవుని నుంచి లభించు జీవమునిచ్చును. అది బలమునిచ్చుటలో లేదా సామర్థ్యమును సమకూర్చుటలో "బలముగలదై" యున్నది, అనగా అది దాని ఉద్దేశ్యమును నెరవేర్చ సమర్థవంతమైనదై యున్నది. అది "దూరగలదై" యున్నది; దేవుడు, తన లిఖితపూర్వకముగా నున్న వాక్యము ద్వారా, ఆయన సత్యము చేత మన హృదయాంతరాళముల లోనికే దూరును. ఆయన సందేశములోని ఒప్పింపుకలుగజేయగల శక్తి చేత, మనము దండింపబడిన పాపులమై యున్నామని తెలిసికొందుము. ఆ తరువాత, లేఖనములలోని సందేశంలో ప్రదర్శింపబడిన కృప ద్వారా, ఆయన నిత్య విశ్రాంతిలో ప్రవేశించుదుమను మహిమగల నిరీక్షణలో మనము నమ్మకముంచుదుము. చివరగా, దేవుని వాక్యము "శోధించుచుడునదై" యున్నది ఎందుకనగా దేవుడు మన హృదయముల నెరుగును. ఆయన నుంచి ఏదియును దాచబడలేదు (వచనము 13).

**వచనము 12.** లిఖితపూర్వకమైన దేవుని వాక్యము సజీవమై [*zaō*] బలముగలదై (*energēs*) యున్నది. దేవుని వాక్యము రోగనిర్ధారణ చేయగలదు మరియు మానవ

హృదయంలోని ఆలోచనలను బయటపెట్టగలదు. ఇది ఎంత బ్రహ్మాండమైన స్వాధికార ప్రకటనయై యున్నదికదా! దేవుని వాక్యము "సజీవమైయున్నదని" చెప్పబడుటలో ఆశ్చర్యము లేదు! (అపొస్తలుల కార్యములు 7:38; 1 పేతురు 1:22–23 చూడుము.) "దేవుని వాక్యము సజీవమైనదై యున్నది, క్రియాశీలకంగా సజీవమైనదై యున్నది. సంబంధిత కాలము [tense] సూచించుచున్నట్టుగా అది నిరంతరాయంగా క్రియాశీలకమైనదై యున్నది. అది శక్తిమంతమైనదై యున్నది,"[32] దేవుని వాక్యము "బలముగలదై" యున్నదనే వాంగ్మూలము యెషయా 55:11లోని గత విషయాలను జ్ఞప్తికి తెచ్చుచున్నదై యున్నది, దేవుని "వాక్యము" "నిష్ఫలముగా" ఆయన యొద్దకు మరలదు, కాని ఆయన దానిని పంపించిన కార్యయములను సఫలము చేయునని ప్రవక్త ప్రకటించియున్నాడు. దేవుని నుంచి ఏదియు దాచబడజాలదు కాబట్టి, సువార్త మన ప్రాణంలోని ప్రతి అణువణువుపై ప్రభావం చూపించునట్లును, మన సమస్త బలహీనతలను బయటపెట్టునట్లును ఆయన దానిని రూపొందించుట సముచితమైనదై యున్నది.

మనమేమైయున్నామో దానిని మనకే బయలుపర్చుచూ, దేవుడు తన వాక్యంలో తనను తాను కూడ బయలుపర్చుకుంటాడు. దేవునికిని మరియు ఆయన వాక్యమునకును నడుమ అత్యంత సన్నిహితమైన సంబంధం ఉంటుంది.[33] 12వ వచనంలోని "దేవుని వాక్యము" అనేది దేవునినే సూచించు ఒక డొంక తిరుగుడు ప్రస్తావనయై యుండుట సాధ్యమే, ఎందుకనగా వెనువెంటనే గల 13వ వచనం దేవుని గూర్చి మాటలాడుచున్నది.[34] పాఠకుడు ఆత్మసంబంధంగా ఏ ఏ విషయాల్లో జబ్బుపడియున్నాడో వాక్యము వానికి స్పష్టంగా సూచింపగలదు మరియు అంతటితో ఆగిపోక వాని ఆత్మ రుగ్మతకు ఆరోగ్యమును సమకూర్చగల నిజమైన చికిత్సను సహితం తెలియజెప్పును. దేవుని సందేశం గతించిపోయిన గతమునకు కాదు; అది "నేడు" మనకు సజీవమైనదై యున్నది (వచనము 7).

12వ వచనంలోని "వాక్యము" *logos* నుంచి పుట్టిన పదమై యున్నది, ఇదే పదం యేసు క్రీస్తు విషయంలో ప్రయోగింపబడింది.[35] కొందరు ప్రాచీన రచయితలు ఇచ్చట కూడ యేసునకు సంబంధించిన ప్రస్తావనను గమనించారు. వాస్తవముగా మాటలాడబడిన లేదా లిఖింపబడిన దేవుని మాటలకు వాటికి ఆరోపింపబడిన ఇటువంటి శక్తి లేదన్నట్లు వారికగుపించినది గనుక వారు ఆ దృక్పథాన్ని అనుకూలించుకున్నారు. ఏది ఏమైనా, లిఖితపూర్వకంగా నున్న దేవుని వాక్యమును, కొంచెము శక్తిగల లేదా శక్తి ఏమియులేని చిరునామా దొరకని ఉత్తరముగా పరిగణించు సంశయవాదుల వలె వారు దానిని తీవ్రంగా పరిగణించలేదు.

"దేవుని వాక్యము ..." **బలముగలదై రెండచులుగల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు హృదయముయొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది.** "వాక్యము" అనే మాట, ఎక్కువగా, క్రీస్తు చేత మాటలాడబడిన మాటలై, యేసు క్రీస్తు మూర్తిమంతమును గూర్చిన ప్రస్తావన కంటే, విశేషంగా – దేవుని నుంచి వచ్చిన లేఖనములలోని మిగిలిన అన్ని సందేశములతోపాటు – ఆయన సువార్త సందేశమై యుండవచ్చు. "వాక్యము 'మంచి చెడులను వివేచించు కుశాగ్రబుద్ధిగలదై' యున్నది. దేవుని వాక్యము వారికి తీర్చునట్లు అనుమతించడానికి బదులుగా, ఇశ్రాయేలీయులు దేవుని వాక్యమును విమర్శించారు.

తత్ఫలితంగా, వారు పొందాల్సిన స్వాస్థ్యమును నష్టపోయారు."[36]

"దూరుచు" (*diikneomai*) అనే మాట, జీవితములను రూపాంతరము చెందించుటకును, మన మానసిక మరియు ఆత్మ సంబంధమైన రూపమును మార్చుటకును దానికి గల శక్తి వాక్యములోనే అంతర్భాగమై యున్నదని సూచించుచున్నది; ఒకనిని రక్షించగల శక్తి సువార్తకు ఉన్నది (రోమీయులకు 1:16). ఒక విత్తనము దానంతట అది మొలకెత్తి ఫలించునట్లు దేవుడు దానిలో జీవమును ఉంచినట్లే, అదే విధంగా ఆయన వాక్యము దానంతట అది ఫలించునిమిత్తము దానిలోనే జీవమున్న విత్తనమై యున్నది (1 పేతురు 1:22-23). "దేవుని వాక్యము దేవుని రాజ్య విత్తనమై యున్నది" (లూకా 8:11). ఈ విధంగా ప్రేరేపింపబడిన దేవుని వాక్యము అంకురమును మొలకెత్తించు ఒక విత్తనమువంటిదై, విత్తువానికి విత్తనమును మరియు తినువానికి ఆహారమును సమకూర్చునదై యున్నది (యెషయా 55:10). అది క్రైస్తవునిలో నూతన జీవితమును పుట్టించు అక్షయమగు విత్తనమై యున్నది. మనము "సువార్త ద్వారా కనబడినవారమై యున్నాము" (1 కొరింథీయులకు 4:15; KJV). NASBలో వ్యక్తం చేయబడినట్లుగా, పౌలు "సువార్త ద్వారా మీ తండ్రి ఆయ్యాడు."

దేవుని వాక్యము సజీవమైనదై యున్నది ఎందుకనగా "అది దేవుని, సమస్త జీవమునకు మూలాధారమై యున్న వాని నిజమైన స్వభావమును ప్రతిబింబించుచున్నది."[37] అది సజీవమైనదై యున్నది ఎందుకనగా అది చెప్పిన పని చేస్తుంది, ఏలయనగా దేవుడు నేడు కూడ తన సమస్త ఉద్దేశ్యముల మరియు వాగ్దానముల ఫలితమును ప్రభావితం చేయుచున్నాడు. దేవుని వాక్యము ఆయన చిత్తము, మరియు ఏ వాగ్దానములకు ఆయనే అండదండయై యుంటున్నాడో వాటి మూర్తిమంతమై యున్నది. దేవుడు మాటలాడాడు, సమస్త సృష్టి సృజింపబడినది (హెబ్రీయులకు 11:3). దేవుని నోట నుండి వెలువడిన మాటలు (కీర్తనలు 95:7-11) ఆయన విశ్రాంతి లోనికి ప్రవేశింపకపోవుటకు గల సాధ్యత గూర్చి హెచ్చరించినవి; ఆయన మాటలు పాపులను ఆయన సన్నిధికి దూరంగా, వెలుపట ఉంచగలవు! దేవునిని ఆయన వాక్యము నుంచి వేరుచేయడానికి ఎవరును ప్రయత్నించకూడదు.

ఒకని హృదయముపై పరిశుద్ధాత్మ చేయు వేరైన ఒక చర్య లేకుండా దేవుని వాక్యమునకు నిజమైన శక్తి లేదని జాన్ కేల్విన్ అనుచరులు నమ్ముచున్నారు. కేల్విన్ ఇలా చెప్పాడు, "ఏలయనగా, దేవుడు తనను గూర్చి వర్ణించడానికి ఆయన ఒక్కడే తన సొంత మాటల్లో చాలిన సాక్ష్యమై యున్నట్లుగానే, అంతరంగమందలి పరిశుద్ధాత్మ సాక్ష్యము చేత రూఢిపర్చబడనంత వరకు, ఆ మాటకు మానవ హృదయములో విలువ ఉండదు."[38] మొదటి శతాబ్దములో దేవుని వాక్యమును గూర్చిన సంపూర్తి ధ్రువీకరణము సమకూర్చబడినదనే విషయాన్ని ఇది అలక్ష్యము చేయుచున్నది, దేవుని వాక్యమును నమ్మి, దానికి లోబడి, రక్షింపబడటానికి ఇది మనకు సరిపోతుంది (మార్కు 16:17-20; యోహాను 20:30, 31; హెబ్రీయులకు 2:1-4). అదనపు ధ్రువీకరణము యొక్క అవసరమును గూర్చిన ఏ స్వాధికార అపేక్షయైనను, సువార్తకు గల ఒప్పింపు శక్తిని తృణీకరించుచున్నది. విత్తనములో, అనగా దేవుని వాక్యములో "జీవము" ఉన్నదనే విషయాన్ని, మృతిచెందుచున్న ఒక ఆత్మకు జీవమునిచ్చు విషయాన్ని, ఇటువంటి స్వాధికార అపేక్ష అంగీకరించుట లేదు (1 పేతురు 1:22-23). ఈ అభిప్రాయము, అపొస్తలులకు చేయబడిన వాగ్దానములను తీసికొని వాటిని

ఆధునిక మానవునికి అన్వయించుట ద్వారా ఒక అవగాహనను ఏర్పరచుకొని, లేఖనములకు తప్పుడు అర్థం చెప్పడము మీద ఆధారపడి యున్నది (ఉదాహరణ యోహాను 14:26; 16:12, 13; 1 కొరింథీయులకు 2:10–13).

"దూరుచు" అనే మాట హెబ్రీ పత్రికలో ఇచ్చట మాత్రమే కనబడుచున్నది. ఇది లూకా గారి అభిప్రాయమును పోలినదై యున్నది, ఉదాహరణ "హృదయమందు నరకబడినవారై" (అపొస్తలుల కార్యములు 5:33; 7:54). ఇది హృదయములోని ఒప్పింపును లేదా ఒకడు వానిని ప్రతిఘటించువానికి సమాధానం చెప్పలేనప్పుడు అనుభవింపబడు తీవ్రమైన కోపమును సూచిస్తుంది. సువార్తకు గల "నరికివేయు" శక్తిని అపొస్తలుల కార్యములు 2:36–38లో గమనించగలము. సంబంధిత శ్రోతలు "వినిన దానినిబట్టి," వారిలో అనేకులు "హృదయములో పొడువబడినారయ్యారు." సువార్త సందేశం ఒప్పింపును కలుగజేయును. అపొస్తలుల కార్యములు 2:37లోని *katanussō* యొక్క KJV అనువాదము, "నొచ్చుకొని," చాలా బలహీనమైన అనువాదమై యున్నది; శరీరములోనికి గుచ్చబడు ఒక సైనికుని ఈటెను సూచించుటకు ఇదే పదము ప్రాచీన కవియైన Homer చేత ప్రయోగింపబడినది. దేవుని వాక్యము యొక్క శక్తి గూర్చిన స్పష్టమైన వివరము ఈ క్రింది విధంగా ఉన్నది:

> అది మానవుని జీవితంలోని లోతైన లోతుల్లోనికి మరియు అత్యధికంగా మరుగైయున్న చోట్లకు చొచ్చుకొనిపోయి, దాని కోరికలతో కూడియున్న అల్పమైన మృగ జీవితమును, ఆసక్తులను మరియు ప్రభావవములను, దేవునితో కూడ ఆత్మ సంబంధమైన సాన్నిహిత్యమును కలిగియుండవలెనను ఆశయములుగల, వాని ఉన్నతమైన ఆత్మసబంధమైన జీవితము నుంచి, రెండంచులుండు ఒక ఖడ్గము ఒక భౌతిక శరీరములోని *కీళ్లను మూలుగను* విభజించునట్లు, విచ్ఛేదించును. అది బాహ్య రూపురేఖలను చూడదు కాని *హృదయములోని* ఆలోచనలను మరియు తాత్పర్యములను వివేచించుటలో నిపుణతగలదై యున్నది.[39]

ఒప్పించుట మరియు మార్పు, అది పరిశుద్ధాత్మ చేయు పనై యున్నది (యోహాను 16:7); పరిశుద్ధాత్మ చేత నడిపింపబడినవాడు, అపొస్తలుల కార్యములు 2:36–41లో, పేతురు చెప్పుచున్న వాక్యము ద్వారా ఇది సాధింపబడినది. కాబట్టి మనము పరిశుద్ధాత్మ ద్వారా బయలుపరచబడిన సందేశము ద్వారా ప్రభువును అంగీకరించాము. "ఆత్మయే జీవింపజేయుచున్నది; శరీరము కేవలము నిష్ప్రయోజనము; నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునై యున్నవి" (యోహాను 6:63). ఆయన దైవికమైన తన వాక్యము ద్వారా పరిశుద్ధాత్మ జీవమునిచ్చును. యేసు శిష్యులు అక్షరాలా ఆయన శరీరమును తినినప్పటికిని, ప్రభు భోజన సంస్కారము సందర్భములో ఈ పని చేయబడిందని కొందరు నమ్ముచున్నట్లుగా, ఇది వారి నిత్యత్వం విషయంలో ఎటువంటి మేలైనను చేకూర్చదు; ఏలయనగా జీవమును కలుగజేయునది వాక్యమై యున్నది, శరీరము కాదు. ఈ మాటను వినవలెను, నమ్మవలెను, మరియు ఈ లక్ష్యము నెరవేరునట్లు, ఆ మీదట దానికి లోబడవలెను. దేవుని వాక్యము "ఆత్మ ఖడ్గము" అని పిలువబడుటలో ఆశ్చర్యమేమియు లేదు (ఎఫెసీయులకు 6:17). అది "రెండంచులుగల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉన్నది" (వచనము 12), అక్షరార్థంగా యేసు (వాక్యము/లోగోస్) యొక్క మూర్తిమంతము విషయంలో ఇలా చెప్పుకొనలేము. ఆయన నోటి నుండి రెండంచులుగల వాడియైన

ఖడ్గమొకటి బయలువెడలుచుండెనని ప్రకటన 1:16 క్రీస్తును చిత్రీకరించుచున్నది. ఈ వర్ణన భిన్నమైన సందర్భములో ఒక భిన్నమైన రూపమై యుండినప్పటికిని, క్రీస్తు మరియు ఆయన వాక్యమునకు గల శక్తిని అది సూచించుచున్నది.

"మాట," క్రొత్త నిబంధనకు వేరుగా వ్యక్తిగత హృదయంతో సూటిగా మాటలాడుచున్న దేవుడై యున్నాడనే అభిప్రాయము గూర్చి లేఖనములలో చెప్పబడలేదు.

"ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు" అనే మాటలు ఆసక్తికరమైన అభివ్యక్తమై యున్నది. దేవుని వాక్యము విభజించుటలో కార్యశీలకమైనదై యున్నది! అది కుటుంబములను మరియు పూర్వ స్నేహితులను విభజించును. R. C. H. Lenski ఈ వాక్యభాగమును అనేక ప్రాపంచికమైన మరియు పరిశుద్ధాత్మను వ్యతిరేకించు ఆత్మసంబంధములేని అంశాలకు అన్వయించాడు. ఆయన ఇలా అన్నాడు, "అనేకమైన ఈ కార్యకలాపములు మంచివై ఉన్నాయని, ప్రశంసింపదగినవై కూడ ఉన్నాయని వాటిని లోకం పొగడవచ్చు; దేవుని వాక్యము దూసుకొనిపోతుంది మరియు ఆత్మకు మనస్సు ఏమేమి చేయుచున్నదో చూపిస్తుంది."[40] ఈ విధంగా అది చెడు నుంచి మంచిని వేరుచేయును, సంబంధించిన అర్థంలోని ఆవశ్యకమైన భాగము ఇదే యుంటుంది.

ఇంతేగాక, దేవుని వాక్యం, **హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది**. "శోధించుచున్నది" అని అర్థమిచ్చునట్లు అనువదింపబడిన గ్రీకు మాటకు (*kritikos*) "వివేచించుట" అని అర్థం (KJV; ASV చూడుము). దేవుని నుండి ఏదియు దాచిపెట్టబడజాలదు (వచనము 13).

**వచనము 13.** వాక్యము తీర్పు తీర్పును ఏ ఒక్కరైనను తప్పించుకొనజాలరు: **మరియు ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు. మనమెవనికి లెక్క యొప్ప చెప్పవలసియున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తము మరుగులేక తేటగా ఉన్నది.** మానవుని స్వభావము నిర్వచింపబడుటకును ఈ వచనమునకును ఏమైనా దగ్గరి సంబంధమున్నదా, లేక ఇది "మానవుని సంక్లిష్టమైన అంతరంగిక స్వభావము లోతుల్లోనికి చొచ్చుకొనిపోవుటకు దేవుని వాక్యమునకు గల అత్యంత గొప్పదైన సామర్థ్యమును చూపించుచున్న" ఒక సర్వసాధారణమైన వాంగ్మూలమై యున్నదా?[41] లేక, "దేవుడు మనలను క్షుణ్ణంగాను, సంపూర్ణముగాను ఎరుగునని" అలంకారికంగా మాత్రమే తెలియజెప్పుచున్నదా?[42] మానవుని సారాంశముగూర్చిన ఈ చిత్రీకరణము 1 థెస్సలొనీకయులకు 5:23లో పౌలు సూచించిన ఆలోచనను పోలినదై యున్నది: "... మీ ఆత్మయు, జీవమును శరీరమును మన ప్రభువైన యేసు క్రీస్తు రాకడయందు నిందారహితముగాను, సంపూర్ణముగాను ఉండునట్లు కాపాడబడునుగాక."

అంతరంగములోని లోతుల్లోనికి చొచ్చుకొనిపోవు ఈ తీర్పు వచ్చుచున్నందువలనను మరియు పాపము విషయంలో మనము దోషులమై యున్నందువలనను, ఈ జీవిత పోరాటంలో కొనసాగగలుగునట్లు శక్తిని సంపాదించుకోడానికి మనకున్న ఆశలేమిటి? సంబంధిత సమాధానం తరువాత చెప్పబడి యున్నది. "వాక్యము" మన ఆత్మలను మరుగులేక తేటగా ఉంచుతుంది, అట్లయినను "మనము లెక్క యొప్పజెప్పవలసినవాడు" దేవుడే (NIV; NKJV). మరొక పర్యాయం, "వాక్యము" దేవునికే పొడిగింపై యున్నట్టు అగుపిస్తుంది. "వాక్యము" నానా విధములైన అర్థములు కలిగియున్నది, కాని మనము దేవుని వాక్యమునకు

సంబంధించిన మన చర్యల గూర్చిన లెక్క యొప్పజెప్పవలసి యుంటుంది. దేవుని యెదుట నిలువబడి న్యాయసమ్మతమైన మన ప్రతిఫలమును పొందుట అది ఎంత భయభీతిని గొలుపు పరిస్థితై యుండునుకదా! ఈ వాక్యభాగము ప్రాయశ్చిత్తం పొందవలసిన అంత్య పరిగణను సూచించవలెను ఎందుకనగా మన దేవుని యెదుట సమస్తమును "మరుగులేక" "తేటగా" (from *gumnos*; అక్షరాలా "ఎటువంటి దాపరికమైనను లేకుండా") ఉంచబడుతుంది. కాబట్టి, మనకు సహాయం చేయడానికి మన ప్రతినిధి ఆవశ్యకమై యుండును. ఈ అవసరమును గూర్చిన వాంగ్మూలము రచయిత యొక్క తరువాతి చర్చను ప్రవేశపెట్టుచున్నది.

మానవుని హృదయం గూర్చి మనకు చాలా తక్కువ తెలుసు, కాని దేవుని వాక్యం మన అంతరంగ పురుషుని ప్రతి అవసరమును తీర్చుననే విషయం మనకు ఎక్కువ తెలుసు ఎందుకనగా అది మనలను సృజించినవాని చేత, మనల గూర్చి సంపూర్ణముగా ఎరిగియున్నవాని చేత మనకు అనుగ్రహింపబడింది. ఈ విషయాన్ని తెలుసుకొనండి, ఆ తరువాత మనము ప్రాయశ్చిత్త నొందాల్సింది ఆయన యొద్ద అనే విషయాన్ని లోతుగా మననం చేయండి (వచనము 13). అంత్య దినాన ఆయన తన కుమారుని ద్వారా మనకు తీర్పు తీరుస్తాడు (అపొస్తలుల కార్యములు 17:30, 31). దేవుని వాక్యమునకును (వచనము 12) వ్యక్తిగతంగా దేవునికిని (వచనము 13) మధ్య అసమంజత్వము లేదు, ఏలయనగా దేవుడు మరియు ఆయన వాక్యమును వేరుచేయజాలము. మనము దేవునితోగాని లేదా ఆయన వాక్యముతోగాని నిర్లక్ష్యంగా ప్రవర్తించకూడదు. గనుక మనము ఆయన విశ్రాంతిలో ప్రవేశించగలుగునట్లు ఆయన చిత్తప్రకారం చేద్దాము, ఆయన వాక్యమునకు లోబడుదాము.

## ప్రధాన యాజకుడుగా అహరోనుపై క్రీస్తుకుగల ఔన్నత్యము (4:14–5:10)

### క్రీస్తు దేవుని సమీపించుట (4:14–16)

**14ఆకాశమండలముగుండ వెళ్లిన దేవుని కుమారుడైన యేసు అను గొప్ప ప్రధానయాజకుడు మనకు ఉన్నాడు గనుక మనము ఒప్పుకొనినదానిని గట్టిగా చేపట్టుదము. 15మన ప్రధానయాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను. 16గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయముకొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము.**

ప్రవక్తలు, దేవదూతలు, మరియు మోషేపై క్రీస్తునకు గల ఔన్నత్యమును చూపించిన తరువాత, హెబ్రీ పత్రిక రచయిత ప్రధాన యాజకుడుగా ఆయనకు అహరోనుపై గల ఆధిక్యతను చర్చిస్తున్నాడు. దేవుని సింహాసనము యొద్ద మనకొక ప్రతినిధి ఉన్నాడనియు, ఆయన మనము ఊహించగలిగిన దాని కంటె గొప్పవాడై యున్నాడనియు, మనము కలలోనైనా ఊహించగల వాటిని మించిన కార్యములు ఆయన మన పట్ల చేయగలడనియు రచయిత 4:14–16లో రచించాడు. ఈ గొప్ప ప్రధాన యాజకుని గూర్చి ఈ మూడు వచనములు, నాలుగు సత్యములను ధ్రువీకరించుచున్నవి. (1) ఆయన ఆకాశమండలముగుండ వెళ్లాడు, అనగా ఇహలోకంలో ఆయన చేయాల్సి వుండిన పని సంపూర్తి చేయబడిందనే

అంతర్భావమును అది సూచించుచున్నది. (2) ఆయన మన యెడల పూర్తి సహానుభూతిని కనుపర్చగలడు. (3) ఆయన శోధింపబడుట ద్వారా విధేయతను నేర్చుకున్నాడు. (4) ఆయన మన నిత్య రక్షణకు మూలాధారమై యున్నాడు. క్రీస్తు చేసిన యాజకత్వ కార్యము ద్వారా మనము బాహాటంగా దేవుని చేరుకొనవచ్చుననేది ఆధారభూతమైన ఆలోచనయై యున్నది.

**వచనము 14. ప్రధాన యాజకుడు** (*archiereus*) అనే పదము ప్రాథమికంగా యూదు ప్రధాన యాజకుని విషయంలో ప్రయోగింపబడింది; కాని ఇచ్చట ఈ పదము **యేసునకు**, అనగా ప్రధాన యాజకుడు మరియు రాజు అయియున్నవానికి అన్వయింపబడుచున్నది. సింహాసనాసీనుడైన మెస్సీయ, యాజకుడుగాను రాజుగాను ప్రవర్తించునని జెకర్యా ముందుగా ప్రవచించాడు (జెకర్యా 6:13). అయితే పాత నిబంధనలోని ఇశ్రాయేలీయుల ఏ రాజైనను, ఇలా ఒక్కటే రెండు పనులు చేయడం అనుమతింపబడలేదు. పాత నిబంధన ప్రకారమైన ప్రధాన యాజకుడు యూదా మతములో సమోన్నతమైన స్థానమును అలంకరించినప్పటికిని, క్రీస్తే **గొప్పవాడై** యున్నాడు ఎందుకనగా ఆయన ఈ ప్రధాన యాజకుడుని కంటె ఎంతో ఉన్నతమైనవాడై యున్నాడు. యూదు క్రైస్తవులు, వారి వారసత్వ సాంప్రదాయమునకు వెనుదిరుగడానికి శోధింపబడినవారై, వారికి ధర్మశాస్త్ర నియమము ప్రకారమైన ఏ ప్రధాన యాజకుని కంటెను ఉన్నతమైన ఒక ప్రధాన యాజకుడుండెననే విషయం తెలిసికొనవలసినవారై యుండిరి. ఇచ్చట మొదలుపెట్టి 10వ అధ్యాయము వరకు కొనసాగుతూ, రచయిత మోషే నియమించిన వ్యవస్థలు మరియు రూపకల్పనల అర్థమును గూర్చిన పూర్తి గ్రహింపును వివరించాడు. మన నూతన ప్రధాన యాజకునికి సంబంధించిన ఈ తర్కము 7:28తో ముగియుచున్నది, కాని సంబంధిత ఆలోచన 8:1లో మరొక పర్యాయం అంగీకరింపబడిన వాస్తవముగా చేపట్టబడింది.

మన ప్రధాన యాజకుడు "యేసు," **దేవుని కుమారుడు**, అయియున్నాడని పఠించే హెబ్రీయులు ఇదొక వింతైన విషయంగా ఉన్నదని అనుకొనియుండవచ్చు. నిశ్చయంగా, కీర్తనలు 110:1ని ఉల్లేఖిస్తూ, మత్తయి 22:43-46లో యేసు పరిసయ్యులను సవాలు చేసినప్పుడు వారు ఉలికిపడినంతగా హెబ్రీయులు ఉలికిపడలేదు:

> అందుకాయన – ఆలాగైతే,
> నేను నీ శత్రువులను నీ పాదముల క్రింద ఉంచువరకు
> నీవు నా కుడిపార్శ్వమున కూర్చుండుమని **ప్రభువు** నా ప్రభువుతో చెప్పెను
> అని దావీదు ఆయనను ప్రభువని చెప్పిన యెడల, ఆయన ఏలాగు అతనికి కుమారుడగునని వారినడుగగా, ఎవడును మారుమాట చెప్పలేకపోయెను. మరియు ఆ దినము నుండి ఆయనను ఒక ప్రశ్నయు అడుగ తెగింపలేదు.

దావీదు పలికిన మాటల ఆధారంగా, యేసు అడిగిన ప్రశ్న ద్వారా, మెస్సీయ "ఇరువురు ప్రభువులై" యున్నట్టు అగుపిస్తుంది, ఇది యూదులకు గొప్ప అడ్డుబండయై యుండింది. వారు ఒక్కడే ప్రభువైయున్న దేవుని యందు – కేవలము ఒక్కడే అయియున్నవాని యందు – పూర్తి నమ్మకముంచారు. అయితే ఇప్పుడు యేసు వారి దృష్టికి రెండవ "ప్రభువుగా" అగుపిస్తున్నాడు. ఇటువంటి ఒక బిరుదు మరియు అధికార హోదా ఒకడు కలిగియున్నాడంటే, ఆయన నిశ్చయంగా "దేవుని కుమారుడు" అయియుండెనను ధ్వనింపునిచ్చినది. ఇది యూదులకు పెద్ద పరీక్ష అయ్యింది: క్రీస్తు, దైవికమైనవాడై యున్నాడని, సర్వశక్తిమంతుడైన

*దేవుని* కుమారుడై యున్నాడని, మరియు వారి నూతన ప్రధాన యాజకుడై యున్నాడని వారు సంపూర్ణంగా అంగీకరించవచ్చునా? "ఇరువురు ప్రభువులను" వారు అంగీకరించవచ్చునా? ఈ భావనను వారు సరిగా అర్థంచేసికొన్నట్లయితే, వారి విశ్వాసంలో వారు స్థిరమైనవారై యుండు దిశగా పయనించుచుండిన వారవుదురు.

యేసు తన సంకల్పమును గట్టిగా చేపట్టియుండిన విధంగానే, మనము కూడ **మనము ఒప్పుకొనినదానినిగట్టిగా చేపట్టవలెనని** మనకు పిలుపు ఇవ్వబడుతున్నది, "గట్టిగా చేపట్టుట" కేవలము విశ్వాసముంచుటకు కొనసాగించుటను మించినదై యున్నది; యాథార్థమైన విశ్వాసం బహిరంగముగా ప్రదర్శింపబడుతుంది. మనము దానిని "గట్టిగా చేపట్టవలెను మరియు బహిరంగముగా ప్రకటించవలెను."[43] ఒకడు "శిబిరము వెలుపలికి" వెళ్లుటకు ఇష్టపడవలసి యున్నది (13:13), మన ప్రభువు శ్రమనొందినట్టుగా, అది నోటి మాటల చేత కావచ్చు మరియు దౌర్జన్యపూరితంగా దాడిచేయబడుట ద్వారా కావచ్చు, శ్రమనొందునని ఎదురుచూడవలసి యున్నది. ఈ దౌష్ట్య లోకం నడుమ ఒకడు ఎంతో కాలం ఉదాసీనమై శిష్యుడై యుండజాలడు. మనము "జీవ వాక్యమును" గట్టిగా చేపట్టిన యెడల, "లోకమందు జ్యోతులవలె" కనబడుదుమని పౌలు వివరించాడు (ఫిలిప్పీయులకు 2:14-16). మనము ఇతరులకు పథ ప్రదర్శకమై/దీపస్తంభమై యుండుట మన లక్ష్యమై యుండవలెను.

పాత నిబంధన ప్రకారమైన యాజకుడు ఆలయములోని అతి పరిశుద్ధ స్థలము లోనికి సంవత్సరమునకు ఒక పర్యాయం వెళ్లుచుండెడివాడు, కాని యేసు మన కోసం **ఆకాశమండలముగుండ వెళ్లాడు**. అతి పరిశుద్ధ స్థలం పరలోకము వంటిదై యుండెనని Josephus చెప్పుచున్నాడు.[44] యేసు అతి పరిశుద్ధ స్థలమునకు ఆవల "ఆకాశమండలముగుండ" వెళ్లడమును హెబ్రీ పత్రిక రచయిత చిత్రీకరించిన విషయాన్నిబట్టి మనము ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు ఆకాశమండలము "గుండ" వెళ్లడము అనగా, అది ఇహలోక రీతిగా ఏ స్థాయిలో నున్న యాజకుడైనను కలిగియుండిన శక్తిని మించిన అత్యధికమైన శక్తియై యున్నదని అర్థం.

బహు వచనంలో నున్న "ఆకాశమండలములు" (ఆంగ్లములో "heavens," *ouranos*) అనే మాట *shamayim* అనే హెబ్రీ పదమును ప్రతిబింబించుచున్నది, ఇది పాత నిబంధనలో మూడు వందల కంటె ఎక్కువైన సందర్భములలో ఎల్లప్పుడు బహువచనంలోనే ఉన్నది. క్రీస్తు, "ఆకాశమండలము లన్నిటికంటె మరి పైకి ఆరోహణమైనవాడునై యున్నాడని" ఎఫెసీయులకు 4:10 సెలవిస్తుంది. ఆయన ఇప్పుడు ఇహలోక సంబంధమైన ప్రతిబంధకములన్నిటికిని ఆవల ఉన్నాడు. ఆయన భౌతిక లోకమునకు పైన అధికారము మరియు మహిమలో ఉన్నాడు. ఆయన పరలోకము లోనికి ప్రవేశించాడు అట్లయినను ఆయన ఆకాశమండలములకు పైన ఉన్నాడనే సామాన్య నానుడిని B. F. Westcott ఉల్లేఖించి చెప్పాడు.[45] యూదు సాంప్రదాయము ఏడు ఆకాశమండలముల గూర్చి చెప్పుచుండినది, అయితే పౌలు మూడు ఆకాశముల గూర్చి చెప్పుచున్నాడు (2 కొరింథీయులకు 12:2). ఈ "మూడవ" ఆకాశం అన్నింటి కంటె ఎత్తైనదని తెలియుచున్నది, గనుక నాలుగు ఉన్నతమైన ఆకాశమండలములు ఉన్నవనే అభిప్రాయమును తొలగించుచున్నది.[46]

**వచనము 15.** యేసు, మానవుడు, దేవుడను అయియున్నాడు - దేవుని యెదుట మానవునికి ప్రతినిధిగా నున్న **ప్రధాన యాజకుడును**, మానవుని యెదుట దేవునికి

ప్రతినిధిగా నున్న దేవుని కుమారుడును అయియున్నాడు. హెబ్రీ పత్రిక పాఠకులు, దేవాలయము యొక్క గాంభీర్యము మరియు సంబంధిత ప్రధాన యాజకుని చేత బహు బాధాకరంగా శోధింపబడ్డారు, వారికి ఇప్పుడు సమస్త విషయములలోను వారి [మన] వలెనే శోధింపబడినను పాపము లేనివాడైయుండిన ఒక రక్షకుడున్నాడని వారు గ్రహించాల్సిన అవసరం ఏర్పడింది. "కాని యేసు ఎన్నడును పాపము చేయలేదుకదా, అలాగైతే ఆయన మన వలెనే ఎలా శోధింపబడుతాడని" ఒకడు ప్రశ్నించవచ్చు. ఆయన మన యెడల సహనుభూతి ప్రదర్శించగలడు ఎందుకనగా పాపమును గ్రహించుట అంటే పాపపు చర్యలో పాల్గొనుట కాదు, కాని విశేషంగా, ఆకర్షణీయమైన దాని ఒత్తిడులను ఎదిరించడమవుతుంది. లొంగుటకు నిరాకరించడం ద్వారా, యేసు మనము కూడ శోధనలను జయించగలమని రుజువుచేస్తున్నాడు.

"సహనుభవము"/"సహనుభూతి" (*sumpatheō*) అనే పదం హెబ్రీ పత్రికలో మాత్రమే కనబడుతుంది. ఈ మాట ఇచ్చట మాత్రమే ప్రయోగింపబడుట కాదు, కాని వారు ఖైదులో ఉన్నవారిని *కరుణింపవలెనని* క్రైస్తవులకియ్యబడిన మందలింపుతో కూడ 10:34లో ప్రయోగింపబడింది. క్రైస్తవులు, క్రీస్తునకు వలెనే సహనుభూతిగలవారై యుండవలెను. "సహానుభవము"/"సహానుభూతి" అనే పదం, "శ్రమను బాహ్యంగా పరిగణించు ఒకడు కనుపరచు జాలిని గూర్చి మాత్రమే తెలియజెప్పడంలేదు, కాని అవతలి వ్యక్తి యొక్క శ్రమను తన సొంత శ్రమను పరిగణించు ఒకని అనుభూతి గూర్చి చెప్పుచున్నది."[47] మన ప్రధాన యాజకుడు బలహీనులను, అల్పులునైనవారి యెడల సహనుభూతి చూపడానికి సమర్థుడై యున్నాడు.[48] యథార్థమైన సహనుభవములో సంపూర్ణ పనితనాన్ని సంపాదించడం మానవునికి కష్టతరమైన ఒక గుణగణమై యున్నది; కాని క్రైస్తవుడు, వానిలో ఎన్ని కొరతలుండినప్పటికిని, వాని ప్రభువు వలె ప్రవర్తించడానికి ప్రయత్నిస్తూనే ఉంటాడు.

పరీక్షించుటకు దానికి గల అంతిమ శక్తికి అది చేరుకొనక మునుపే శోధనకు లొంగిపోయేవాడు, పాపమును గూర్చి అంత వరకే తెలుసుకుంటాడు, దానికి ఆవల నున్న విషయం వానికి తెలియదు, ఏలయనగా వాడు అతి గొప్ప పరీక్షకు చేరుకొనక మునుపే దోషభావములో పడిపోయాడు.

శోధన బాధలతో ఏర్పడు పరిచయము మనము పాపులైన ఇతరులపై జాలిని కనుపర్చడానికి మనలను ప్రేరేపిస్తుంది. యేసు మానవత్వమును అనుభవించాడు, అది కూడ మరణగునంతగా అనుభవించాడు (ఫిలిప్పీయులకు 2:8 చూడుము). మనము ఆయనను తాకవచ్చు (వచనము 15; KJV). ఆయన వాత్సల్యంలేనివాడు మరియు సహనుభూతి ఎరుగనివాడు కాడు, సరికదా ఆయన ప్రజలందరికి పైన నుండు వైభవోపేతమైన సింహాసనము మీద ఆసీనుడైనవాడు కాడు. యేసు సంపూర్ణంగా మనలో ఒకడయ్యాడు. మనము కూడ ఎదిరించవచ్చుననే సత్యమును శక్తిమంతమైన ఆయన మాదిరి చూపిస్తుంది.

ఆయన తన బలహీనతల యందు బాధననుభవించాడు, గనుక మనము కూడ అనుభవించవలసినవారమై యున్నాము; అయితే ఆయన దేవుని విషయంలో చేయాల్సిన సేవను ఆయనకు ఎదురైన కష్టాలు ఆటంకపర్చుటను ఆయన ఎంతమాత్రమును అనుమతించ లేదు (వచనము 15). ఆయన శారీరక బాధను, అలసటను, మరియు ఇతరుల వలని నిరాశలను ఎదుర్కొన్నాడు. ఆయన ఎల్లప్పుడు తన తండ్రి చిత్తమునే నెరవేర్చవలెనను

ధ్రుఢసంకల్పంగలవాడై యుండెను. ఆయన "రాజు భుజించు భోజనమును, పానముచేయు ద్రాక్షారసమును పుచ్చుకొని తన్ను అపవిత్రపరచుకొనకూడదని ఉద్దేశించిన" దానియేలు వంటివాడై యుండెను (దానియేలు 1:8). యేసు ఎన్నడును శోధింపబడలేదని మనము చెప్పకూడదు! యేసు ఎదుర్కొనిన అతి గొప్ప శోధన "ఆయన చేపట్టిన విమోచనా కార్యక్రమమంతటికి స్వస్తిచెప్పాలని, వేలాది దేవదూతల సైన్యసమూహాన్ని పిలిపించాలని," మరియు సిలువ మీద మరణించకుండానే తన శత్రువులను జయించాలను సహజాతోద్వేగం వంటిదై యుండిందని James Burton Coffman భావించాడు.[49]

యేసు శోధనలను మరియు శ్రమలను వాటి చరమ స్థాయి వరకు అనుభవించాడు గనుక తత్ఫలితంగా మన బలహీనతలను అర్థంచేసికొనగలుగుచు, మానవులమైన మన యెడల సహానుభూతి చూపుతున్నాడు. "క్రీస్తు, శోధనకు ఎన్నడును లొంగనివాడై యుండెను గనుక, పనికిమాలిన పాపి కంటె ఎక్కువ సాతాను యొక్క బలమేమిటో ఆయన ఎరుగును."[50]

"శోధింపబడెను" (*peirazō* నుండి) అనే మాటకు "పరీక్షింపబడెను" అని అర్థం. యేసు "శోధన" గూర్చి మనము అనుకొనే విషయం ఎక్కువగా ఆయన విశ్వాసము మరియు సుస్థిరత పరీక్షింపబడుచుండిన పరిస్థితై యుండింది, కాని ఈ మాట "పరీక్ష" మరియు "శోధన" అనే రెండర్థాలు ఇయ్యవచ్చు. యేసు అవాంఛనీయమైన ప్రవర్తన విషయంలో "శోధింపబడ్డాడని" హెబ్రీ పత్రిక సూచించడం లేదు, కాని ఆయన గెత్సెమనే తోటలో చేసిన ప్రార్థన మరియు సిలువ మరణము సందర్భంలో అనుభవించిన వేదన ద్వారా ఆయన విశ్వసనీయత పరీక్షింపబడుటపై కేంద్రీకరించుచున్నది (5:7, 8). ఆయన ఎదుర్కొనిన పరీక్షలు ఈ పత్రిక వ్రాయబడుచుండిన సమయంలో క్రైస్తవులు ఎదుర్కొనవలసి యుండిన పరీక్షల వంటివై యుండినవి. బలమైన విశ్వాసముగలవానికి, ఈ పరీక్ష ఒక గొప్ప శోధనయై యుండదు.

యేసు పాపమనే శోధనకు లొంగకుండానే శ్రమలననుభవించారు గనుక (వచనము 15; 1 పేతురు 2:20–22), "యేసు నిజముగా పాపము చేయగలిగి యుండెనా?" అనే ప్రశ్న తరచుగా అడుగబడుచున్నది. లేదంటే, శోధనయే లేకుండిందని అర్థం! ఆయన పాపము చేయలేదనే ఆలోచన యేసు సాతాను చేత శోధింపబడెనని సువార్తలలో వ్రాయబడిన విషయం సరైనది కాదని అనిపించవచ్చు (మత్తయి 4:1–11; మార్కు 1:12, 13; లూకా 4:1–13). ఈ నివేదికలు యేసు లోనుకాని శోధనను మనముంచుచున్నట్లయితే, అవి ఎక్కువ అర్థవంతముకానివిగా కనిపించవచ్చు.

యేసు శోధింపబడ్డాడు, కాని శోధింపబడుటలో పాపము లేదు. "ప్రతివాడు తన స్వకీయమైన దురాశచేత ఈడ్వబడి మరులుకొల్పబడినవాడై శోధింపబడునని" యాకోబు చెప్పుచున్నాడు (యాకోబు 1:14). మన కోరికలను పురికొల్పుటలో దుష్టుడు సఫలీకృతుడు కావచ్చు, కాని యేసు జయించిన విషయం ఇదే. యేసు, దేవుడై యుండి, పాపము చేయజాలకపోయాడని సూచింపబడుచున్నది;[51] కాని ఆయన తన దేవ స్వభావము మూలముననే పాపమును జయించగలిగాడని మనము అనుకున్నట్లయితే మనము పొరపాటు చేయుచున్నాము. ఆయన శోధింపబడినప్పటికిని, ఆయన పాపములేనివాడుగానే యుండెననేది బైబిలు బోధయైయున్నది.

"నేను ఎదుర్కొనుచున్న శోధనలను యేసు ఎన్నడును అనుభవించలేదని" శోధనలతో పెనుగులాడువారు చెప్పవచ్చు. "పాపము లేనివాడుగా" ఉండెనంటే, ఆయన ఎన్నడును శోధింపబడలేదని అర్థం కాదు. సకల మానవులు ఒక "పాపిష్ఠి స్వభావముతో" పుట్టారని నమ్మేవారిని, "యేసునకు మన శరీరమునకు భిన్నమైన ఒక శరీరము వంశానుగతంగా ప్రాప్తించినదా? లేదంటే, ఆయన శోధనలు తన సొంత 'పాపిష్ఠి స్వభావములో నుంచి' పుట్టాయా?" అని ప్రశ్నిస్తున్నాను. ఆయన శోధింపబడగలినట్లయితే, ఆయన పాపముచేయగలవాడై యుండెనని అర్థమీయవచ్చు, లేదంటే, శోధన అనేది లేదని మనము భావించవచ్చు.

యూదుల ప్రధాన యాజకుడు అతి పరిశుద్ధ స్థలంలోనికి ప్రవేశించినప్పుడు అతడు మానవుని మించినవాడయ్యాడనియు, దేవునికిని మానవునికును మధ్య నుండిన సరిహద్దు రేఖ యొద్ద అతడు నిలిచియుండుట దేవుని పరితారకుడైన ఇతనిని పాపము మరియు దుర్నీతి లేనివానిగా కాపాడిందనియు ఫిలో చెప్పుచుండెను.[52] నిశ్చయంగా, యెరూషలేములోని యాజకులు దీనిని నమ్మడమును మించిన విషయాలను ఎరిగియుండిరి, కాని మొదటి శతాబ్దమునాటి ఇతర యూదులు ఇదే విధమైన అభిప్రాయములను కల్పించుకొని యుందురు. అవసరమవుతాయని ఫిలో ఊహించుకొనుచుండిన ప్రమాణములకు సహితం యేసు సంపూర్ణంగా సరిపోయినవాడై, యోగ్యుడై యుండెననేది హెబ్రీ పత్రికలో మనకు అగుపించు ప్రతిస్పందనయై యున్నది.

**వచనము 16.** ఇటువంటి గ్రహింపుగల ప్రదాన యాజకుడు మనకున్నాడు గనుక, మనము ఆయన ద్వారా క్రమము తప్పనివారముగాను శ్రద్ధాభక్తులతోను, మరియు ధైర్యముతోను తండ్రి యొద్దకు చేరుకొనగలము. కృపాసనము **యొద్దకు చేరడానికి** మన పాపముల క్షమాపణ కోసం ప్రార్థించు అవకాశం లభించవలెను.

మనము కనికరము కొరకు ప్రార్థించవలసి యున్నది. మనము ఇటువంటి ప్రార్థనలు చేయడానికి ఈ వచనము మనలను ప్రోత్సహించుచున్నది. "యొద్దకు చేరుదము" అనే పదజాలము సర్వసానాన్యమైనదై యున్నది మరియు అది ఈ పత్రిక యొక్క కీలకమైన భావమై యున్నది. ఈ పదము 7:18–19, 25; 10:1, 22; మరియు 11:6లో ప్రయోగింపబడి యున్నది. 6:17–18లో ఇదే భావం అంతర్నిహితమై యున్నది.

"యొద్దకు చేరుదము" అని అర్థమిచ్చు గ్రీకు పదము (*proserchomai*), ఆరాధనా పరిచర్య స్ఫూర్తితో వారు మాత్రమే దేవుని యొద్దకు చేరగల యాజకులతో సంబంధముగలదై యున్నది.[53] ఇదే ప్రత్యేకార్హత సకల క్రైస్తవులకు పొడిగింపబడినది.[54]

ఆలయములోని అతి పరిశుద్ధ స్థలములోనికి యాజకుడు మాత్రమే ప్రవేశించ నర్హుడై యుండెను. తమ్మునుతాము మలినము చేసికొనని యాజకులు పరిశుద్ధ స్థలము లోనికి ప్రవేశించిరి. మతనిష్ఠ మరియు శుద్ధీకరింపబడిన యూదు పురుషులు వెలుపలి ప్రాంగణములోనికి ప్రవేశించుటకు అనుమతింపబడిరి. యూదు ప్రాంగణమునకు ఆవల అన్య జనుల ప్రాంగణముండినది, దీనికి కొంచెము దూరములో స్త్రీల ప్రాంగణముండినది. యేసు ఈ అడ్డంకులన్నిటిని తొలగించాడు. గనుక మనము మత తండ్రి "యొద్దకు చేరుటకు," దైవపీఠము యొద్దకు సహితము చేరుటకు మనము అనుమతింపబడి యున్నాము (10:22 చూడుము). మనము దేవుని సన్నిధి లోనికి ప్రవేశిస్తాము, ప్రార్థన ద్వారా దేవుని

యొద్దకే సమీపిస్తాము. ఆయన యొద్దకు మనము ఏ నిమిషంలోనైనా చేరుకొనగలుగుటకు ఆయన మనకు అందుబాటులో ఉన్నాడు. Wiersbe ఇలా సూచిస్తున్నాడు,

> ఇశ్రాయేలీయుడొకడు శోధనను ఎదుర్కొన్నప్పుడు, సహాయం కోసం వాడు ప్రధాన యాజకుని యొద్దకు వాడనుకున్నంత సులభంగా పరుగెత్తలేకపోయాడు; మరియు దేవుని సహాయం కోసం నిశ్చయంగా వాడు అతి పరిశుద్ధ స్థలంలోనికి ప్రవేశించలేకపోయాడు. కాని యేసు క్రీస్తునందలి విశ్వాసులముగా, మనము మన ప్రధాన యాజకుని యొద్దకు ఏ నిమిషంసోనైనా, ఏ పరిస్థితిలోనైనా పరుగెత్తుకొని వెళ్లవచ్చు, మరియు మనకు అవసరమైన సహాయమును పొందవచ్చు.[55]

ఇంతేగాక, అన్యమతారాధికులు వారి దేవతలను సమీపించిన విధంగా, భయముతోను వణకువతోను మనము ఆయనను సమీపించనవసరం లేదు.

యూదుడు సహితం, "పరలోకమందున్న మా తండ్రీ" అని ప్రార్థించడానికి సాహసించలేదు (మత్తయి 6:9). పాత నిబంధన కాలంలో దివ్యమైన దేవునితో కలిగియుండగల ఇటువంటి సంబంధం అభివృద్ధి కాలేదు. ఈనాడు, క్రైస్తవులముగా, కుమారుడు **మనలను అర్థంచేసుకుంటాడు** గనుక ఆయన తన తండ్రి కుడి పార్శ్వమున కూర్చుండి, మన మొరలను ఆలకించు చెవులుగలవాడై, కృపాసనము నొద్దకు చేరడానికి సన్నిహితమును సమకూర్చుతాడని యెరిగినవారమై, మనము ఆయననను **ధైర్యముతో** సమీపించవచ్చు. సహజంగానే, మనము మన సొంత యోగ్యతనుబట్టి దేవుని యొద్దకు వెళ్లినట్లయితే, దేవుడు మన మొర ఆలకించడు.

"కృపాసనము" అనే పదము, యూదులు "దేవుని సింహాసనము"ను సంబోధించుచుండిన మరొక విధానమై యుండింది. దేవుని పేరును వ్యర్థముగా ఉచ్చరించకుండునట్లు, ఇలా పలుకడం యూదులకు ఒక ఆదర్శమై యుండింది. ఇచ్చటి "ఆసనము" దేవునికే ప్రతినిధియైన ఒక సభ్యోక్తియై యున్నది. ఆయన "సర్వకృపానిధియగు దేవుడు" అని పిలువబడుతున్నాడు (1 పేతురు 5:10). ఇది ఆయనకు తగిన బిరుదై యున్నది ఎందుకనగా ఆయన స్వభావము యొక్క సారాంశము **కనికరమై** యున్నది. ఆయన సన్నిధిలో **మనకు సమయోచితమైన సహాయము కొరకైన కృప ప్రాప్తిస్తుంది**. మనము తెలుసుకున్నా లేక తెలుసుకోకపోయినా, మనము ఎల్లప్పుడు అవసరములో ఉన్నవారమై యున్నాము. దేవుని కనికరముతో కూడిన స్వభావమును తెలిసికొనుట వలన ప్రార్థన ద్వారా, పరలోకమందున్న మన తండ్రితో స్వేచ్ఛగా ముచ్చటిస్తూ మనము ఆయన యొద్దకు ధైర్యముతో చేరగల సామర్థ్యము మనకు కలుగుతున్నది. ఇట్టి భభీతిని గొలుపు ఆలోచన మనకు ఎంత గంభీరమైన ఆదరణను కలుగజేయుచున్నది కదా! దేవుని సింహాసనము, మనము అనుగ్రహము కోసం అడుగుకొని దానిని పొందగల చోటై యున్నది. అనేక సందర్భములలో మన రక్షకుడు చేసినట్టుగానే, మనము కూడ సింహాసనమును సమీపించినప్పుడు, మనము ఆయన మహిమలో పాలుపంచుకుంటాము.

హెబ్రీయులకు 4:14-16 మరియు 10:19-23కు మధ్య గల పోలికలను మనము గమనించవచ్చు. ఈ రెండు వాక్యభాగములు కూడా మనము ఒప్పుకొను విషయాన్ని గట్టిగా చేపట్టుచు, ధైర్యముతో దేవునిని సమీపించుట గూర్చి చెప్పుతున్నాయి. ఈ పత్రిక బహు చక్కగా వ్యవస్థీకరింపబడిన సంగ్రహ సిద్ధాంతమై యున్నది; రచయిత మొదట

అభిప్రాయములను ప్రస్తావించి ఆ మీదట వాటిని మరొక పర్యాయం చర్చించాడు, తద్వారా తాను చెప్పదలచుకున్న విషయాన్ని బలముగా చెప్పాడు. మొదట, 4:14-16, మన ప్రధాన యాజకుని వలని ప్రయోజనాలను ప్రవేశపెట్టుచున్నది, ఆ తరువాత 10:19-23 వాటిని పునఃధ్రువీకరించుచున్నది. 5వ అధ్యాయం మొదలుకొని 9వ అధ్యాయం వరకు ఇదే ఆలోచనా ధోరణిలో ఉంటూ, వాటిని పాఠకులకు ప్రముఖంగా ప్రకటించుచున్నవి. యాజకత్వమునేది యూదు క్రైస్తవులకు సుపరిచితమైన విషయమై యుండింది గనుక వారు ఇట్టి తర్కము వలన బహుగా ప్రభావితులై యుందురు.

క్రీస్తు, మన ప్రధాన యాజకుడు, మన కొరకు విజ్ఞాపనము చేయుచున్నాడు. యాజకునిగాను మరియు రాజుగాను, ఆయన మొదటి ప్రధాన యాజకుడైన అహరోను కంటె మరియు పాత నిబంధన యాజకులందరి కంటెను అత్యధిక ఔన్నత్యముగలవాడై యున్నాడు. ఆయన పాపరహితమైన జీవితం జీవించాడు, గనుక శ్రమలు మరియు శోధనల గూర్చి ఆయన బహుగా ఎరిగినవాడై యున్నాడు. మన బలహీనతలేమిటో ఆయనకు తెలియును గనుక ఆయన మనపై తన కనికరమును చూపుతున్నాడు.

## అదనపు అధ్యయనం కొరకు:
## ప్రాణము (*soul*) మరియు ఆత్మ (*spirit*) (4:12)

"ప్రాణము" (*psuchē*) మరియు "ఆత్మ" (*pneuma*) అనేవి వేరువేరైన అంశములనుగా పరిగణించాలా, లేక అవి ఎల్లప్పుడు ఒకే విషయము గూర్చిన వైవిధ్యములై ఉంటున్నాయా? అప్పుడప్పుడు వాటిని వేరువేరుగా పరిగణించడం కష్టమవుతుంది: ఒకడు తన "ప్రాణము"ను పోగొట్టుకొనడం, వాని ఆత్మను శాశ్వతంగా పోగొట్టుకొనడం ఒకటే కాదా (మత్తయి 16:26)? ఏది ఏమైనా, ఒకడు "ప్రాణము" చచ్చిపోవుట గూర్చి చదువచ్చు, కాని "ఆత్మ" చచ్చిపోవుట గూర్చి చదువడు. సిలువ మీద యేసు తన "ఆత్మ"ను (*pneuma*) తండ్రికి అప్పగించుకున్నాడు (లూకా 23:46), తన "ప్రాణమును" (*psuchē*) కాదు. "ప్రాణము" అనే పదం, ఒకని దేహాత్మలను మొత్తంగా కలిపి సంబోధించిన సందర్భములుంటున్నవి - ఉదాహరణ "నోవాహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా ... ఆత్మలు ... ఎనిమిది మంది" (*psuchē* నుండి) రక్షింపబడుట గూర్చిన ప్రస్తావన (1 పేతురు 3:19-20). ఇతరమైన కొన్ని సందర్భములలో, *psuchē* అనే పదం, "ఆత్మ" అనే అదే అర్థము నిచ్చుచున్నది.

మానవుడు నిజముగా ఒక ఉన్నతమైన స్వభావంగలవాడై యున్నాడు, ఇట్టి తాత్పర్యం "ఆత్మ" అనే పదము చేత సూచింపబడుచున్నది. వాని అల్పమైన స్వభావం వాని "ప్రాణము" (*psuchē*) అయియుండవచ్చు, ఇది తరచుగా ఒకని జంతుసంబంధమైన జీవితము అనే అర్థము నిచ్చుచున్నది. "Spirit" అనేది ("ఎస్" పెద్ద అక్షరముగలది) ఎన్నడును మానవుని అల్పమైన స్వభావమునకు సంబంధించినది కాదు. దేవుని వాక్యము, మూలుగను మరియు కీళ్లను వేరుచేయునట్లుగా, ప్రాణము నుంచి ఆత్మను వేరుచేయగలదు.[56] హెబ్రీ పత్రిక చెప్పుచున్నట్టుగా, మనము ఒకని "శరీరము," "జీవము," మరియు "ఆత్మ" గూర్చి నిర్దిష్టముగా ప్రస్తావించవచ్చు (1 థెస్సలొనీకయులకు 5:23). మనము ఈ పదములను ఏ కోణంలో చూచినా, దేవుడు మహిమలో మన సంపూర్తి వ్యక్తిత్వమును -

నిత్యత్వమును కొరకు రక్షింపబడవలసియున్న ఆత్మసంబంధమైన నూతన శరీరములతో సహా, రక్షించుననే విషయం మాత్రం మనకు కచ్చితంగా తెలియును. ఒకానొక దినాన ఆయన "అంధకారమందలి రహస్యములను వెలుగులోకి తెచ్చును" (1 కొరింథీయులకు 4:5) అనగా, మన హృదయములో ఆలోచనలను మన స్వభావముననుసరించి స్పష్టముగా బయలుపర్చును. "మానవులకు అసాధ్యమైన విభజించుట మరియు వివేచించుట యను పనులను దేవుని వాక్యము చేయగలదని" చెప్పినప్పుడు, George Wesley Buchanan కచ్చితంగా సరైన సంగతే చెప్పాడు.[57]

1 థెస్సలొనీకయులకు 5:23 మానవునిలో గల ముప్విధమైన స్వభావమును ధ్వనించుచున్నది. ఏది ఏమైనా, ప్రానము మరియు ఆత్మ మధ్య గల తారతమ్యములను వివేచించడానికి చేయబడు ప్రయత్నములు కల్పించుకొనబడినవై యున్నట్టు తరచుగా కనబడుచున్నది. ఒక విధానమేమనగా: "దేహము, దానిని సజీవంచేయు ప్రాణమునకు నిలయమై యుండగా, ఆత్మ అనేది, ప్రాణము దేహమును సజీవం చేయునప్పుడు దానికి మార్గనిర్దేశనములను ఇచ్చునదై యుండుటకు దేవుని చేత ఉద్దేశింపబడినదై యున్నది."[58]

## అన్వయము

**మిగిలియున్న విశ్రాంతి (4:1-11)**

విశ్వసనీయమైనవారి కొరకు దేవుని ఏర్పాటు ప్రకారంగా వేచియుంటున్న నిత్య "విశ్రాంతి"లో మనము పూర్తి నమ్మకముంచినప్పుడు, మనశ్శాంతి మనదవుతుంది. అమితోద్రేకము మరియు గందరగోళముతో కూడియున్న ఈ లోకం ఇటువంటి సమాధానం కోసం నిశ్చయంగా పాకులాడుచున్నది. వారం రోజులు వారు చేయుచుండు పనుల నుంచి ఒక రోజును విశ్రాంతి దినముగా ఆచరింపవలెనని ప్రభుత్వం చేత ఆజ్ఞాపింపబడకుండానే క్రైస్తవులు సబ్బాతు దిన విశ్రాంతిని ఆచరిస్తున్నారు.[59]

బల్యర్పరణల నిమిత్తం చేయబడిన పాత నిబంధన ప్రకారమైన ఏర్పాట్లలో అధిక శాతం క్రీస్తు చేసిన బల్యర్పణ కార్యమునకు సంకేతమై యుండినట్టుగానే, పాత నిబంధన ప్రకారమైన విశ్రాంతి దినమునాటి విశ్రాంతి, క్రొత్త నిబంధన ప్రకారం సమకూర్చబడిన విశ్రాంతికి ముందుఛాయయై యున్నది. ఈ విషయంతో, సమూనాలు మరియు ఛాయల గూర్చిన పాఠం మొదలవుతుంది. "దేవుడు తన కార్యములను ముగించి విశ్రమించిన ప్రకారము" (హెబ్రీయులకు 4:10), విశ్వాసులైనవారు వారి దైనందిన ప్రయాసముల నుంచి విశ్రాంతినొందు సమయం వస్తుంది. మన విశ్రాంతి యూదు సబ్బాతు విశ్రాంతికి మాత్రమేగాక, "దేవుని సొంత విశ్రాంతి"కి సహితం అనుగుణ్యమైనదై యుంటుంది.[60] ఏది ఏమైనా, ఏమియు చేకుండా, కాలక్షేపంచేస్తూ నిత్యత్వమును గడుపవచ్చుననే అభిప్రాయం, పరలోకమును గూర్చిన బైబిలు సంబంధమైన దృష్టికోణం కాదు. మనము నిత్యత్వమంతటిలోను ఆ యా పనుల్లో నిమగ్నమై యుండవచ్చు, కాని యిక మీదట మనపై భారం మోపబడదు. "మనకున్న ప్రేమనుబట్టి, చేయబడు పనినిబట్టి కలుగు ఆనందం కొరకు, ఆ పనిలో నీకు గల పనితనమునుబట్టి కలుగు గర్వముతో, అట్టి పనులు

చేయబడుట ద్వారా ఇతరులకు మేలు చేకూరవలెనను ఉద్దేశంతో చేసినప్పుడు, పనులు చేయడం ఒక శాపం కాదు. ఇటువంటి పరోపకారిత పనులు చేయకపోవడనే జీవితానికి అసలైన శాపం."[61]

**"భయము" (4:1)**

బైబిలులో భయమును గూర్చిన అన్యోన్య వైరుధ్యంగల ఉపదేశము అగుపిస్తుంది. మనము భయపడకూడదని యేసు సెలవిచ్చాడు (యోహాను 14:27), దేవుడు "మనకు శక్తియు, ప్రేమయు, ఇంద్రియ నిగ్రహమునుగల ఆత్మనే యిచ్చెను గాని పిరికితనముగల ఆత్మనియ్యలేదని" పౌలు తిమోతిని మందలించాడు (2 తిమోతి 1:7). అట్లయినను, మనము "దేవునికి భయపడవలెనని" (1 పేతురు 2:17; ప్రసంగి 5:7బి నుంచి ఉల్లేఖించి చెప్పాబడింది) మరియు "భయముతోను వణకుతో" మన సొంత రక్షణను కొనసాగించవలెనని ఆదేశింపబడుతున్నాము (ఫిలిప్పీయులకు 2:12). కీర్తనల గ్రంథమందంతటను, దేవునికి భయపడుట గూర్చిన ప్రస్తావనలున్నా. "యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట జ్ఞానమునకు మూలమని" సమెతలు 9:10 సెలవిచ్చుచున్నది. "... ఆత్మను దేహమును కూడ నరకములో నశింపజేయగలవానికి మిక్కిలి భయపడుడని" యేసు సెలవిచ్చాడు (మత్తయి 10:28). దయ్యములును నమ్మి వణకుచున్నవి (యాకోబు 2:19).

గంభీరమైన, పూజనీయభావంగల భక్తిసంభ్రమము మరియు మర్యాదతో మనము దేవునికి భయపడవలసి యున్నది. హెబ్రీయులకు 4:1లో, దేవుడు వాగ్దానము చేసిన విశ్రాంతిలో ప్రవేశించకుండ తప్పిపోదుమేమో అని మనము భయపడవలెనని హెచ్చరింపబడుతూన్నాము. కాబట్టి, సకల భయములు, తప్పైనవై యుండజాలవు. క్రొత్త నిబంధనకు సంబంధించిన అనేక చేతిరాత ప్రతులలో "భయము" అని అర్థమిచ్చు గ్రీకు పదము, ప్రాథమికంగా పూజయనీయమైన భక్తిసంభ్రమములతో కూడిన "భయము" అని అర్థమిచ్చు *phobeō* అనే పదము నుంచి పుట్టిన *phobos* అయియున్నది. నిజముగా, పరిపూర్ణమైన ప్రేమ భయమును వెళ్లగొట్టును (1 యోహాను 4:18), కాని మనలో *పరిపూర్ణమైన* ప్రేమగలవారు ఎవరున్నారు? బలహీనులు, పరిపక్వతలేనివారు, లేదా క్రైస్తవ *పరిపూర్ణత* కొరతగా నున్న ఎవరైనను, ఎంతో కొంత భయము కలిగియుండవలెను. మనలను ఇరుకు మరియు సంకుచితమునైయున్న దారిలో ఉంచడానికి భయమనే అంశం అవసరమై యున్నది (మత్తయి 7:14; KJV). దిగజారిపోవుటకు అత్యధికంగా ఉన్ముఖులైయున్నవారికి, హెబ్రీ పత్రిక రచయిత ఇలా రాస్తున్నాడు. "జీవముగల దేవుని చేతిలో పడుట భయంకరము" (హెబ్రీయులకు 10:31). వారు "వినయపూర్వకమైన భయభక్తులు" (*eulabeia*) అనగా, పూజనీయమైన భయము లేదా భక్తిసంభ్రమమును, భక్తితో కూడిన భయమని కూడ ధ్వనించు భయమును కలిగియుండవలెనని 12:28-29లో శిష్యులను బ్రతిమలాడుతున్నాడు. "భయము" అని అర్థమిచ్చుచున్న గ్రీకు పదములో నుంచి పుట్టిన, ఒక విధమైన "భయము" లేకుండా మనము దేవుని వెంబడించజాలము. వారు పశ్చాత్తాపపడని పాపులుగా దేవుని చేతిలో పడుదురేమో అనే భయం వారిలో లేశమైనా ఉంటే తప్ప, అనేకులు దేవునికి లోబడరనేది ఒక వాస్తవమై యున్నది. ఇటువంటి ప్రోత్సాహకమునుబట్టి వారు దేవుని వైపు తిరుగుట వలన వారిలో వినయపూర్వకమైన హృదయం, లోబడుటకు గల ఇష్టము, మరియు

భయపడాల్సిన అవసరతను చివరకు సమూలంగా నిర్మూలించు ప్రేమ అంకురకించునని ఆశించుచున్నాము.

**"విశ్వాసముగలవారై కలిసియుండలేదు" (4:2)**

విశ్వాసము, దేవుని దృష్టిలో నమ్మదగినది లేదా జీవముగలదై యుండాలంటే, అది విధేయతతో జతగా కలిసియుండాలి. ఇశ్రాయేలీయులు ఐగుప్తు దేశమును విడిచి కనాను దేశమునకు వెళాల్సి యుండిన ప్రయాణం మొదలయ్యే సమయానికి, వారు దేవుడు చేసిన అద్భుతములను, శక్తిమంతమైన కార్యములను మరియు ఆయన మహిమను కళ్లారా చూసారు. ఏది ఏమైనా, నెఫీలీయుల గూర్చిన "చెడ్డ" నివేదిక మూలాన వారు కనాను దేశ సరిహద్దుల్లోనే ఆగిపోయారు (సంఖ్యాకాండము 13; 14). నిస్సందేహంగా పొట్టివారైన ఇశ్రాయేలీయుల కంటే, ఐగుప్తు దేశంలో బానిసలుగా ఉండినందునుబట్టి వారి ఆహారం అత్యల్పమైనదై యుండివారి కంటే, నెఫీలీములు భారీ భాహు దారుఢ్యంగలవారై యుండిరి. శత్రుసైన్యం గొప్పదై యుండుటనుబట్టి ఇస్రాయేలీయుల మనోభావాలు తలమునకలయ్యాయి గనుక ప్రజల విశ్వాసం దెబ్బతిన్నది. అయితే, దేవునికి, పరిమానముతో పనిలేదు, అవసరమయ్యిందెల్లా విశ్వాసమే.

విశ్వాసం, విధేయతతో కూడిన క్రియాల్లో ప్రదర్శింపబడాలి. లేదంటే, అది "మృతమైన విశ్వాసమే" అవుతుంది (యాకోబు 2:17). ఏది ఏమైనా, విశ్వాసము కూడ ఒక క్రియయే – అది మానవులు చేయవలెనని దేవుడు వారికి నియమించిన విషయమై యున్నది (యోహాను 6:28, 29). విశ్వాసమును ఆయన మన హృదయాల్లో అద్భుతకరమైన రీతిలో నాటడు; కాని దానిని విని, దాని ప్రకారం ప్రవర్తించినట్లయితే, అది విశ్వాసమును పుట్టించునను రుజువును ఆయన తన వాక్యములో సమకూర్చాడు (రోమీయులకు 10:17). కాబట్టి, ఎఫెసీయులకు 2:8, 9 మరియు రోమీయులకు 3:28లో చెప్పబడిన విధంగా, మన రక్షణను సంపాదించుకొనడంలో నివాయింపబడిన క్రియలు, "ధర్మశాస్త్రమునకు సంబంధించిన క్రియలై" యున్నవి లేదా ఒకడు తన రక్షణను *సంపాదించుకోడానికి* ప్రయాసపడు క్రియలైయున్నవి. మన జీవితాల్లో పరిపూర్ణత లోపించుచున్నందునుబట్టి రక్షణను సంపాదించుకొనడమనేది అసాధ్యం గనుక, రక్షణ సాధనంగా మనము విశ్వాసముపైనే ఆధారపడవలసి యున్నది – రక్షణ సంపాదించుకోడానికి *విశ్వాసమనేది* మనము చేయవలెనని దేవుడు నియమించిన విషయమై యున్నదని జ్ఞాపకం చేసుకొనవలసి యున్నది (యోహాను 6:29). రక్షణ పొందడానికి మానవుడు ఏమియు చేయనవసరం లేనట్లయితే, "మీరు ... రక్షణపొందుడని" పేతురు ఎందుకు సెలవిచ్చాడు (అపొస్తలులకార్యములు 2:40; KJV)? "భయముతోను వణకుతోను మీ రక్షణను కొనసాగించుడని" పౌలు క్రైస్తవులకు ఎందుకు సూచించాడు (ఫిలిప్పీయులకు 2:12)? నిశ్చయంగా, మనము దేవునికి లోబడినప్పుడు, తండ్రి మన ద్వారా తన కార్యమును చేస్తుంటాడు – కాని వ్యక్తిగతమైన మన చొరవను లేదా లోబడుటకుగల మన అనిష్టతను నియంత్రించుటకు బలప్రయోగం చేయడు.

లౌకికమైన ప్రజలు ఐహికమైన చెత్తను సేవిస్తుంటారు, వారికొక ఆత్మ ఉన్నదని, దానికి అవసరములు ఉన్నాయని వారు తరచుగా గుర్తించరు. కొన్ని సంవత్సరముల క్రితం, ఆస్ట్రేలియా పట్టణానికి దూరంగా జనసమ్మర్దంలేని చోట ముగ్గురి దేహములు కంటబడినవి.

వారు ఆకలితో అలమటించి తమ అసువులు బాసారు, కాని వారి కడుపులు నిండుగా నిండియుండినవి. వారు ఆహారపు విలువ ఏమియులేని ఒక మొక్కను ఆరగించారు. మానవుడు గొప్ప నిక్షేపంగా పరిగణించు చిల్లర విషయాలు – లౌకిక వియయం, విద్యాసంబంధమైన బిరుదులు, మరియు సిరిసంపదలు – ఆత్మకు ఆహారాన్ని అందించడంలో నిరర్థకమైనవే. సువార్తను వినినవారు పాపములో మరనించినప్పుడు, వారు బైబిల్లు అనుమతింపబడని మతేతరుల దేశంలో పుట్టియుండవచ్చు.

**జగత్పునాది దినములు (4:3, 4)**

సృష్టి యంతయు సృజింపబడిన ప్రతి ఒక్క దినము, వెయ్యి సంవత్సరముల కాలమునకు సంకేతమై యున్నది మరియు ఈ లోకం ఏడు వేల సంవత్సరముల పిదప అంతమవుతుందనే దృష్టికోణాన్ని కొందరు చేపట్టియున్నారు. ఈ అభిప్రాయం, దైవసంకల్ప విధానమునకు సంబంధించిన సహస్ర సంవత్సరముల పాలనకు పూర్వ కాలము యొక్క దృక్పథమునకు సంబంధించినదై యున్నది, అయితే దీనికి లేఖనములలో ఆధారము లేదు. ఈ అభిప్రాయం 2 పేతురు 3:8చేత మద్దత్తు ఇవ్వబడుతుందని ఊహింపబడుతున్నది: "... ప్రభువు దృష్టికి ఒక దినము వెయ్యి సంవత్సరముల వలెను, వెయ్యి సంవత్సరములు ఒక దినము వలెను ఉన్నవి." దేవుని దృష్టిలో ఒక దినము అక్షరాలా వెయ్యి సంవత్సరములై ఉన్నాయని పేతురు భావించియుండినట్లయితే, వెయ్యి సంవత్సరములు అక్షరాలా ఒక దినమై యుండాలి, ఇది పేతురు భావమై యుండజాలదు. దేవుడు తన వాగ్దానములను నెరవేర్చక మునుపే వెయ్యి సంవత్సరములు గడిచిపోయినప్పటికిని, ఆయన వాటిని సరైన సమయంలో నెరవేరుస్తాడని పేతురు సూచించుచుండెను. మనము చేసిన వాగ్దానములను కొంత కాలం గడిచేలోపు మనము మర్చిపోతాము, కాని దేవుడు అలా మర్చిపోడు. "ఒక దినము, వెయ్యి సంవత్సరములతో సమానము" అనే సిద్ధాంతము రెండవ శతాబ్దములో ఉండింది; అది బర్నబా పత్రికలో (*Epistle of Barnabas*) ఏర్పాటుచేయబడింది (15:4, 5) మరియు అది అటుతరువాత అప్పుడప్పుడు ప్రోత్సహింపబడింది.[62] దేవుడు ఈ విశాల విశ్వమంతటిని సృజించడానికి మొదలుపెట్టి, దానిని పూర్తి చేసిన తరువాత, ఆయన పనిచేయుటను ఆపివేయలేదు; కాని సృష్టి కార్యములను నిలిపివేసి విశ్రాంతిలో ప్రవేశించాడు.

**నేడే దేవుని దినమై యున్నది (4:7)**

దేవుడు "నేడు" అని పిలువబడే ప్రతి దినమును తన అధీనములో ఉంచుకొనియున్నాడు గనుక ఆయన నీ రేపటి దినాన్ని సహితం అదుపుచేయగల సమర్థుడై యున్నాడు; ఆయన ప్రతి దినమును నీ యొక్క అంతిమ మేలు నిమిత్తమై దీవిస్తాడు (రోమీయులకు 8:28). ఆయన ఈ దినమును మరియు రేపటి దినమును కూడ ఉత్తేజవంతమైనదిగాను ఆశ్చర్యకరమైనదిగాను చేయగలడు. ఈ దృష్టికోణం పుట్టించు ఆశావాదమును మనము కొనసాగించుచుండవలెను. ఒక చిన్న పిల్ల పాత నిబంధనలోని కొన్ని కథలు విన్న తరువాత, "అయితే దేవుడు ఆ రోజుల్లో ఈనాటి కంటె ఎక్కువ ఉత్తేజవంతుడై యుండెనన్నమాట" అని వ్యాఖ్యానించింది.[63] మనము ఎల్లప్పుడు వెనుకటి రోజులను గుర్తుచేసుకుంటూ, ఆ రోజులు సంఘాలకు అతి గొప్ప రోజులై ఉండినవని భావించు ఉన్ముఖతగలవారమై యుంటున్నాము.

1950 మరియు 1960 సంవత్సరములలో, అమెరికా దేశంలో ప్రభువు సంఘాలు గొప్ప ఎదుగుదలను అనుభవించాయి – కాని అల్పమైన అట్టి అభివృద్ధి దాదాపుగా ఏబది సంవత్సరములు గడిచిన తరువాతే జరిగింది. ఇప్పుడు, ఇరవైఒకటవ శతాబ్దము ఆరంభంలో, దేవుని రాజ్యములో సంభవింపబోయే బ్రహ్మాండమైన ఎదుగుదలను మనము మరొక పర్యాయం చూడవచ్చు.

నేటి దినాల్లో, మతం విషయంలో లోకమంతా గందరగోళంతో నిండియున్నది, ప్రజలంతా బైబిలు సంబంధమైన సామాన్య సత్యముల కోసం తహతహలాడుతున్నారు. ఏది ఏమైనా, అనేకులు తేలికగా మోసపోతున్నారు గనుక సమాధానాల కోసం బైబిల్‌లో తప్ప, ప్రతి చోట అన్వేషిస్తున్నారు. ఆ యా శాఖాపరమైన సంఘాల్లో ప్రోత్సహింపబడుతున్న సిద్ధాంతముల గూర్చి మన యౌవన బిడ్డలకు ఎంతో ఎక్కువగా తెలియుననను విషయాన్ని కనుగొన్నప్పుడు, ఇటీవల నేను ఆశ్చర్యపడాల్సిన అవసరం లేకుండింది. ఒక మతం ఉపదేశించే బోధల గూర్చిన చర్చ మా తరగతిలో జరుగుచుండిన తరుణంలో, ఒక విద్యార్థి లేచి, "ఆ విషయాన్ని వారెలానమ్మగలరు?" అని ప్రశ్నించాడు. దీనికి సమాధానమేమంటే, చిన్న నాటి నుంచి కూడ వారు అలాగే పెరిగారు; దానినే నమ్మాలని శిక్షణ ఇవ్వబడ్డారు. దేవుని గూర్చిన అబద్ధ దృష్టికోణముల వైపు ఇంత మంది మళ్లింపబడుతున్నట్లయితే, యింకా ఎక్కువ ఆసక్తిగల సౌవార్తీకరణ స్ఫూర్తిని మరియు విధానములను మనలో అభివృద్ధి చేసికొనడం ద్వారా సామాన్యమైన క్రొత్త నిబంధన క్రైస్తవ్యమునకు మనము కచ్చితంగా అనేకులను మళ్లింపగలము. మనము ప్రజల ముందు సత్యమును ప్రదర్శించినప్పుడు వారిని క్రీస్తు వైపు మళ్లించుట సులభతరమవుతుంది.

ఏదో ఒక గొప్ప విషయాన్ని సాధించడానికి మనము చరిత్రపుటల్లోనికి చాలా ఆలస్యంగా అడుగుపెట్టామని లేదా నీ ద్వారా మరియు అనేక మంది ఇతరుల ద్వారా తన సంఘాల్లో గొప్ప ఎదుగుదలను సాధించడానికి ప్రభువు సిద్ధంగాలేదని మనము ఎన్నడును అనుకొనకూడదు. ఈ రోజులు సహితం దేవుని దృష్టిలో "నేడు" అయియున్నవి!

### "మీ హృదయములను కఠినపరచుకొనకుడి" (4:7)

ప్రతి దినం, తెరువబడిన మనస్సుతో దేవుని వాక్యము ద్వారా ఆయన స్వరాన్ని వినుచుండుము, అప్పుడు నీ హృదయం ఎన్నడును కఠినం కాదు.

> నీవు మారుటకును, ఇతరులను మార్చుటకును దేవుని విన్నపమును వినుచునే నీ భుజాలు దులిపివేసుకుంటూ వాయిదావేయుచుండు ప్రతి సందర్భం, "చేయాలని నాకు తెలుసు, కాని నేను ఆ విషయాన్ని పట్టించుకోను" అని నీవు నీ తలనాడించు ప్రతి సమయం, అంతరంగములో అంకితభావం లేకుండానే బాహ్యంగా మాత్రమే అనుగుణముగా ఉంచుటకు చేయబడు ప్రతి ప్రయత్నం, హృదయ కాఠిన్యతకు దారి తీస్తుంది గనుక మారుమస్సు నొందుట అంతకంతకు మరింత కష్టతరమవుతుంది.[64]

మనలో ఊపిరి ఉన్నంత వరకు, అది మనకు "నేడే." మారుమనస్సు నొందుట ద్వారా, మనము మన హృదయ కాఠిన్యత ఆరంభమును హరింపజేయవచ్చు.

**ఆ విశ్రాంతిలో ప్రవేశించుటకు జాగ్రత్తపడుడి (4:11)**

రక్షణను "క్రియల ద్వారా సంపాదించుకొనవచ్చు" అనే అభిప్రాయం గూర్చి Raymond Brown తన ఆందోళనను అభివ్యక్తం చేసిన తరువాత, మొదట సువార్తకు లోబడాలి, ఆ మీదట ద్వితీయ శ్రేణికి చెందిన "పవిత్రీకరణమును" సంపాదించుకొనాలని అనుకునేవారిని గద్దించడానికి ఆరంభించాడు. "పవిత్రీకరింపబడిన క్రైస్తవుడవై యుండుటకు, ఒకడు సమస్త ఉత్సాహమును సడలించి, నైతిక పోరాటమునకు సంబంధించిన ఏ ఆలోచననైనను విడిచిపెట్టడనే సమంజసం అనే సలహాను, "మనస్సులో నుంచి తీసివేసుకో, దేవుని అనుమతించు" అనే భావమునకు అది మరీ ఎక్కువగా దోహదపడుతుందని" ఆయన సహేతుకంగా తర్కించాడు.[65] మనము మన రక్షణను సంపాదించుకొని దానిని కొనసాగించడానికి ప్రయాసపడాల్సిన పనిలేదని ఇటువంటి అభిప్రాయం సూచిస్తుంది, ఏలయనగా అది "క్రియల" వలన కలిగిన రక్షణ అవుతుంది. మన రక్షణ మరియు పవిత్రీకరణము, కేవలము మన మానసిక సమస్యలను దేవుని యెదుట వదిలిపెట్టుట ద్వారా నెరవేరునని మనము ఊహింతుకున్నట్లయితే, అప్పుడు ఈ విషయంలో మనము అంత శ్రద్ధగలవారమై యుండము మరియు మన "నైతిక ప్రయాసమును" మానివేయవచ్చు. అయితే ఈ వాక్యభాగము నుంచి, "నైతిక ప్రయాసం" అవసరమనే విషయం విదితమవుతుంది.

ప్రతి ఒక్కడు పడుచుండు ప్రయాసమును ఒకడు గుర్తించి కూడా, "ఆ పనంతా దేవుడే చేయునట్లు అనుమతించు!" అనే వేదాంతము గూర్చి పట్టుబట్టినప్పుడు, అది పొంతన లేకుండా పోతుంది. విభిన్న కోణల్లో గల ఈ రెండు భావనల మధ్య సామరస్యమును కలిగించవచ్చును, కాని దానికి, "మీరు మోజుపడు అన్ని విధములైన వంపులు మరియు మెలికలు ఇచ్చట చేయబడును!" అని ఇంగ్లండులో ఒకసారి ఒక పాత కమ్మరివాని అంగడి గోడ మీద వ్రాయబడి యుండిన వాణిజ్య ప్రకటన వలె, కొంచెం వృత్తికౌశలం అవసరమవుతుందని కొందరు వేదాంత పండితులు అనుకొనుచున్నారు.

"... అట్టి విశ్వాసం అతని రక్షింపగలదా?" అని ఆయన ప్రశ్నిస్తూ, విశ్వాసమునుబట్టి చేయబడు క్రియల అవసరత గూర్చి యాకోబు ప్రకటించుచుండెను (యాకోబు 2:14). ఒకడు కేవలము తన తోటి విశ్వాసికి కనుపరచు విశ్వాసము గూర్చి ఆయన మాటలాడుచుండలేదు, కాని నిజముగా రక్షణార్థమైనదైయున్న విశ్వాసము గూర్చి ఆయన మాటలాడుచుండెను. యాకోబు చెప్పుతున్న విషయాన్ని మనము కాదనలేము. నిశ్చయంగా, రక్షణకు మరియు పవిత్రీకరణమునకు అవసరమైన సాధనమును దేవుడు సమకూరుస్తాడు, కాని ఆయన మన కోసం అన్ని పనులను చేయడు. కొరింథీ విశ్వాసులకు పౌలు ఇలా సెలవిస్తున్నాడు, "ప్రియులారా, మనకు ఈ వాగ్దానములు ఉన్నవి, గనుక దేవుని భయముతో పరిశుద్ధతతను సంపూర్తి చేసికొనుచు, శరీరమునకును ఆత్మకును కలిగిన సమస్త కల్మషము నుండి మనలను పవిత్రులనుగా చేసికొందము" (2 కొరింథీయులకు 7:1). మనము దేవుని యెదుట ప్రదర్శించు విధేయతనుబట్టి, ఆయన మనలను పరిశుద్ధులనుగా చేయును, అది లేకుండా చేయడు (ఫిలిప్పీయులకు 2:12, 13).

దేవుడు తన కార్యములను పౌలు ద్వారా, "నన్ను బలపరచువానియందే నేను సమస్తమును చేయగలను" (ఫిలిప్పీయులకు 4:13) అని పలికినవాని ద్వారా చేసినట్టు, మన

ద్వారా కూడ చేయవలెనని మనము ఆశించుచుండవలెను. అప్పుడు మనము నిజముగా దేవునితో కలిసి పనిచేయు "జతపనివారమై" యుండగలము (1 కొరింథీయులకు 3:9). మనము చేసే "వినయపూర్వకమైన పరిచర్య"తో నిమిత్తము లేకుండా, మనము దేవునితో కలిసి ఆయన జతపనివారముగా పనిచేయుచున్నామని మనము ఎరిగియుండుట, ఆశ్చర్యజనకమైన ఒక ఆలోచనయై యున్నది! మానవ ప్రయత్నం అవసరమే కాని మనము దేవునితో కలిసి పనిచేసినప్పుడు అధికంగా ఆనందించగలము!

ఇశ్రాయేలీయులు కనాను దేశంలో పొందిన "విశ్రాంతి," క్రైస్తవులు అనుభవించనైయున్న విశ్రాంతికి ఒక *ఛాయయై* యుండింది. పాత ధర్మశాస్త్రమునకు సంబంధించిన కర్మకాండలన్నియు, ప్రత్యేకమైన భోజన పదార్థములను భుజించుట లేక, సబ్బాతు దినమును ఆచరించుటతో సహా, క్రీస్తునందు ప్రాప్తించు నిజమైన పదార్థమునకు ఒక ఛాయయై ఉన్నవనే ఇదే విధమైన భావనను కొలొస్సయులకు 2:16, 17 బయటపెట్టుచున్నవి. ఇశ్రాయేలీయుల విశ్రాంతి వారికి వాగ్దానము చేయబడిన దేశములో ఏర్పాటుచేయబడినదై యుండినది: మంచి పంటలు, శత్రువులు దాడిచేస్తారేమోనన్న భయం లేదు, పంట దిగుబడి విషయంలో దిగులు లేదు, కరువుండదు – ఇవన్నీ కూడా వారి విశ్వసనీయత ద్వారా వారి సొంతమయ్యేవే. ఏది ఏమైనా, ఆ గొప్ప దీవెనలు భౌతికమైనవై యుండినవి గనుక చిరకాలముండు సంతృప్తినిచ్చియుండవు. క్రైస్తవుని విశ్రాంతి వానికి సమాధానమును కలుగజేస్తుంది, దేవుని సన్నిధిలోనే మహిమన్వితమైన నిత్యత్వమును సమకూర్చుతుంది. ఇదే నిజమైన విశ్రాంతి దినాచారమై యున్నది.

**ఆలస్యమయిన దినం – అవిధేయతకు ఉదాహరణము (4:11)**

వారు వెంటనే వెళ్లి దేశమును స్వాధీనం చేసికొనవలెనని ఇశ్రాయేలు ప్రజలకు కాలేబు మరియు యెహోషువ తెలియజెప్పినప్పుడు, వారి అభిప్రాయన్ని మన్నించక వారు, "ఆ రాత్రి యెలుగెత్తి యేడ్చిరి" (సంఖ్యాకాండము 14:1). కాలేబు మరియు యెహోషువ లేదా మోషే మరియు అహరోనులు వారికి తెలియజెప్పిన మాటల చేత ఇశ్రాయేలు ప్రజలు ఒప్పింపబడలేదు. ఏది ఏమైనా, "యెహోవా మహిమ" ప్రత్యక్షపు గుడారములో కనబడినప్పుడు (14:10) మరియు మోషే అహరోనులు పెట్టిన మొరకు ప్రభువిచ్చిన ప్రత్యుత్తరము సమావేశమైయుండినవారికి తెలియజెప్పబడినప్పుడు, వారి అవిశ్వాసమునుబట్టి వారు ఖిన్నులయ్యారు. గనుక వారు లోబడుటకును, వెళ్లి కనాను దేశాన్ని జయించుటకును తీర్మానించుకున్నారు (సంఖ్యాకాండము 14:39, 40), కాని అప్పటికే అది ఒక రోజు ఆలస్యమైపోయింది.[66] వారు తిరుగుబాటు చేసారు గనుక తత్ఫలితాన్ని అనుభవించాల్సినవారై యుండిరి, అనగా అరణ్యములో చచ్చిపోవాల్సిందే. దేవునికి లోబడటానికి సదవకాశమిచ్చు సమయమున్నది, ఆ సమయం "నేడే" (హెబ్రీయులకు 4:7). దేవుని యొద్ద, "ఇంత వరకే, కాని ఇక మీదట లేదు" అనే నియమమున్నది. ఆయన అనుగ్రహించు మారుమనస్సు మరియు క్షమాపణ మనము చేసిన పాపము వలని ఫలితమును ఈ జీవితంలో తొలగింపకపోవచ్చు. పాపము చేసిన ఇశ్రాయేలీయులను క్షమించాలని దేవుడు నిర్ణయించుకున్నప్పటికిని, వారు అరణ్యములో మరణంపాలయ్యారు. ఇదే విధంగా మనము కూడ దేవునికి లోబడుటకు మొదట నిరాకరింపవచ్చు, అట్లయినను

కడకు రక్షింపబడవచ్చు. ఏది ఏమైనా, నిత్యత్వములోనికి రాక మునుపు, మన తాత్కాలిక అవిధేయతనుబట్టి మనము లెక్కలేనన్ని విధాల్లో శ్రమలననుభవించవచ్చు.

ఇశ్రాయేలీయులు ప్రదర్శించిన అవిధేయత వారి "పతనము" (*piptō*)గా, అనగా, "విఫలమగుట"గా లేక "పడిపోవుట"గా పరిణమించింది. ఇదే పదము రోమీయులకు 11:22లో ప్రయోగింపబడింది, కృప నుంచి పడిపోవుటకు గల సాధ్యత గూర్చి బైబిలులో సువిదితంగా నున్న వాంగ్మూలములలో ఇదొకటై యున్నది. ఒకడు దేవుని మంచితమనములో కొనసాగడానికి నిరాకరించినట్లయితే, వాడు "నరికివేయబడును." స్వధర్మభ్రష్టత్వములో గల అపాయం వాస్తవమైనదై యున్నది, గనుక సిద్ధాంతపరమైన ఏ వాదోపవాదమైనను ఈ సత్యమును మార్చజాలదు.

**శక్తిమంతమైన వాక్యము (4:12, 13)**

అది కలిగియున్న శక్తి మూలమున, ప్రసంగ వేదికల నుంచి, తరగతి గదుల్లో, మరియు గృహములలో వాక్యము ప్రబోధింపబడవలెను మరియు ఉపదేశింపబడవలెను. వాక్యము – పాత మరియు క్రొత్త నిబంధనలు – ప్రసంగవేదికలపై నుండి ఆచరణాత్మకమైన అన్వయముతో కూడ, తెలివిని కలిగించుటకు ఏకధాటిగా సుస్పష్టం చేయబడవలెను. దేవుని వాక్యము నిరంతరము బోధింపబడునట్లు చూచుకొనడం, సంఘ నాయకుల ప్రాథమిక బాధ్యతయై యున్నది, ఏలయనగా హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచు, మనుష్యులను నీతి వైపు మళ్లించునట్లు, సమస్తమును మరుగుపరచక తేటతెల్లము చేయగల శక్తి వాక్యమునకున్నది. బైబిలు తరగతుల్లోని ఉపదేశములు, గృహ కూడికలలోని అధ్యయనములు, అవి మంచివే అయినా, సామాన్యంగా వాక్యము బాహాటంగాను, సామాన్యంగాను బోధింపబడినప్పుడు కలిగియుండు బలము మరియు శక్తిగలవై యుండవు.

వాక్యమునకు "దూరగల" శక్తి ఉన్నది. అనగా, దానిని ధ్యానించు నిమిత్తమై వాక్యము వాని హృదయములో నిలిచియుండునట్లు ఒకడు అనుమతించినప్పుడు, అది వాని ఆత్మను పాపము గూర్చి ఒప్పించునని అర్థం. మనము ఈ పని చేసామా? పెంతెకొస్తు దినాన వారు "హృదయములో పొడువబడిరి" (అపొస్తలుల కార్యములు 2:37), లేదా తీవ్రమైన పశ్చాత్తాపముతో నింపడిరి. వాక్యము వారి హృదయములను విభజించినది. వారు మారుమనస్సు నొంది, పేతురు అటుతరువాత వారికి ఆజ్ఞాపించిన విధంగా (అపొస్తలుల కార్యములు 2:38), బాప్తిస్మము పొందడానికి సిద్ధంగా ఉండిరి. నీవు ఈ దశకు యింకా చేరుకొననట్లయితే, నీవు దేవుని వాక్యము చేత "పొడువబడి" విభజింపబడలేదని అర్థం.

12 మరియు 13 వచనముల ప్రకారం, వాక్యము ఏమైయున్నదో, అది ఏమేమి చేయగలదో, సంక్షిప్తంగా సూచింపబడుచున్నది: (1) అది దేవుని వాక్కై యున్నది. (2) అది జీవముగలదై యున్నది. (3) అది బలముగలది మరియు శక్తిమంతమైనదై యున్నది. (4) అది "రెండంచులుగల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి" కార్యసార్థకమైనదై యున్నది. (5) అది చొచ్చుకొనిపోతుంది. (6) అది "ప్రాణాత్మలను విభజించునంతమట్టుకు దూరుచు" పునఃరుజ్జీవమును కలుగజేయునదై యున్నది. (7) అది "హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచు," సమస్తమును మరుగులేక తేటతెల్లము

చేయుచున్నది.[67] దేవుని వాక్యము, మనము (యాకోబు 1:25; 2 కొరింథీయులకు 3:18).

**మనము దేవుని లెక్క ఒప్పజెప్పవలసి యున్నది (4:13)**

రాబోవు తీర్పు గూర్చి మనమెందుకు బోధించాలి? ఎందుకనగా, "మనమెవనికి లెక్క యొప్పచెప్పవలసి యున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగులేక తేటగా ఉన్నది" (వచనము 13). రాబోవుచుండిన తీర్పు గూర్చి రచయిత తన పాఠకులకు అనేక పర్యాయములు గుర్తుచేసినప్పటికిని (6:1, 2; 9:27; 10:27), వారు బైబిలు సంబంధమైన ఈ సిద్ధాంతము విషయంలో అదివరకే సుపరిచితులై యుండిరనేది విదితమవుతుంది. అందరును క్రీస్తు న్యాయపీఠము యెదుట ప్రత్యక్షము కావలయును (2 కొరింథీయులకు 5:10, 11). పౌలు సంపూర్ణముగా అంగీకరించిన, ఈ సత్యమునుబట్టియే, వారు క్రీస్తుకు లోబడునట్లు ఆయన "మనుష్యులను ప్రేరేపింపవలసి" వచ్చినది.

అంతముందు అందరికీ తీర్పు ఉంటుంది (హెబ్రీయులకు 9:27). వెయ్యేళ్ల పరిపాలన చేత రెండు లేదా అంత కంటె ఎక్కువ పర్యాయములు తీర్పు తీర్చబడుతుందనేది ఏదీ లేదు, ఏలయనగా మృతులలో నుంచి మనలను లేపువానిని మనమందరము ఎదుర్కొంటాము (యోహాను 5:28, 29). పెద్దలైనవారు వారి అండదండలను ఆశ్రయించియున్న గొఱ్ఱెల గూర్చిన "లెక్క" ఒప్పజెప్పుతారు (హెబ్రీయులకు 13:17). అవిధేయతను ప్రదర్శించిన ఆత్మలకు భయంకరమైన తీర్పు ఉంటుంది: "శపింపబడినవారలారా, నన్ను విడిచి అపవాదికిని వాని దూతలకును సిద్ధపరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి" (మత్తయి 25:41). నిత్య నరకము ననుభవించు శిక్ష విధిపబడుటకు సాధ్యముకానట్లతే, తీర్చబడు తీర్పునకు అంతగా అర్థముండదు. ఈ అంశము సాధారణంగా ప్రజాదరణ పొందినది కాదను భయమునుబట్టి మనము దీనిని భోధించకుండా ఉండకూడదు. మనుష్యులు నరకము గూర్చి చులకనగా మాటలాడుచూ దాని అసలు స్వభావమును లెక్కచేయనప్పుడు, ఇదే అంశం గూర్చి యింకా ఎక్కువ ఉద్ఘాటనతో ఉపన్యసించడం ఎంతైనా అవసరమై యున్నది. ఒకనాడు తీర్పు గూర్చి బహు బలముగా బోధించిన బోధకుడు, అతని తరువాతి జీవితకాలంలో ప్రజలపట్ల మితిమీరిన "దయాళువై," నశించినవారిని హెచ్చరించుటలో విఫలుడయిన అదే బోధకుడు, తీర్పు దినాన, అయ్యో! నేను అప్పుడే బోధించియుంటే ఎంత బాగుండేదికదా? అని ఎంతగా విచారపడునో కదా!

**మన వలెనే శోధింపబడెను (4:14, 15)**

యేసు ఇహమందు చవిచూచిన అనుభవములను G. C. Brewer ఈ క్రింది సంఘటనతో దృష్టాంతరీకరించాడు. ఒకానొక ఆదివారంనాటి సాయంకాలమున ఆయన Chattanooga, Tennesseeలో బోధించుచుండెను. అట్టి సందర్భంలో మనము ఎదుర్కొనవలసి యున్న భావోద్రేకములను అన్నింటిని మన ప్రభువు అనుభవించిన విషయాన్ని ఆయన వివరించుచుండెను. 1920–29 సంవత్సరములలో, ప్రభువు సంఘానికి సంబంధించిన సభ్యులంతా నానావిధ ప్రజా కార్యక్రమములకు ప్రయోజనపడుచుండిన ఒక భవనంలో కూడుకొనుచుండిరి. ఆరాధన ముగిసిన తరువాత ద్వారము నొద్ద ఆయనను కలుసుకొనిన ఒక యౌవనుడు, Brewer బోధించిన విషయాలను అతడు నమ్మడంలేదని

చెప్పాడు. “నేను ఎదుర్కొనుచున్నవాటిలో ఏ ఒక్క పరిస్థితినైనను యేసు ఎన్నడును ఎదుర్కొనలేదని” అన్నాడు. Brother Brewer ఆ యౌవనున్ని ప్రశాంతంగా ఉండిన ప్రక్క గదిలోనికి ఆహ్వానించాడు. లోనికి వచ్చిన యౌవనుడు తన బాధనంతా ఆయన ముందర ఒలకబోసాడు. అతని భార్య, వారి పసిబిడ్డతో కూడ వేరొక పురుషునితో వెళ్లిపోయిందని చెప్పాడు. ఈ బాధతో, ఎలాగైనా సరే ఆ వేరొక పురుషున్ని వెదకి, పట్టుకొని వానిని హతమార్చి, తన భార్యను మరియు బిడ్డను వెనక్కి తెచ్చుకోవాలన్న ద్రుఢనిశ్చయంతో ఆ నాటి సాయంకాలం వారి కోసం వెదకుచుండెనని ఒప్పుకున్నాడు. “యేసు ఎన్నడూ పెళ్లి చేసికోలేదు, గనుక ఆయన తన భార్యను మరియు బిడ్డను ఎన్నడూ కోల్పోలేదు!” అంటూ ఆ యౌవనుడు వెక్కి వెక్కి ఏడ్చాడు. వివరాలను వింటూ, పరిస్థితిని గమనించుచుండిన తాను ఒక్కసారిగా కొద్దిసేపు నిర్ఘాంతపోయాడని Brother Brewer చెప్పాడు. అయితే, ఇంతలో అచ్చట కూడుకొని యుండిన కొందరి కోసం ఒక మూలలో ఒక పియానో ఉండిందని గమనించాడు. అది ఆయనకు ఒక ఆలోచనను పుట్టించింది. అప్పుడాయన, “అటు చూడు బాబూ, అక్కడ ఒక పియానో ఉన్నది, కనబడుతుందా! లోకం ఎప్పుడైనాగాని వినిన స్వరాలన్నింటినీ అది వాయించలేదు, కాని వాయించబడగల స్వరాలన్నీ దానిలో ఉన్నాయి. అలాగే, సరిగ్గా నీ అనుభవమునే యేసు ఎన్నడూ అనుభవించలేదు – కాని ఆయన అంత కంటే గొప్పదైన నష్టాన్ని ఎదుర్కొన్నాడు, ఆయన అతిగా ప్రేమించినవాడే ఆయనకు ద్రోహం చేసాడు. ఔను ప్రియ యౌవనుడా, నీవు అనుభవిస్తున్న బాధేమిటో ఆయనకు బాగా తెలుసు” అన్నాడు.

మనము నిస్సహాయ స్థితిని మరియు మానసిక వ్యధను అనుభవించుచున్నామని అనుకున్నట్లయితే, రండి, యేసును చూద్దాము. ఆయన సిలువపై మరణించడానికి వచ్చునంత వరకు ఆయన జీవితం మొత్తం ఒక పురోగమనమై యుండింది మరియు ఆయన సిలువపై ఆ ఒంటరితనము యొక్క చరమదశకు చేరుకొని. “నా దేవా, నా దేవా, నెందుకు చెయ్యివిడిచివని” కేక వేసాడు (మత్తయి 27:46). పునఃరుత్థానుడైన ప్రభువునందలి విశ్వాసంతో, ఆయన సిలువ మీద అనుభవించినంతటి గొప్ప ఒంటరితనాన్ని మనము అనుభవించాల్సిన అవసరం లేదు. మనము ప్రార్థనలో క్రీస్తు ద్వారా తండ్రి యొద్దకు “ధైర్యముతో” చేరుకొనవచ్చు (వచనము 16). మన ప్రభువు ఎప్పుడైనాగాని లోతైనా మన అవసరాలకు “లేదు” అని నిజముగా సెలవిచ్చునా? నామట్టుకైతే ఇది సందేహమే, ఏలయనగా ఆయన “ఔను!” అని సెలవిచ్చే ప్రభువై యున్నాడు. (2 కొరింథీయులకు 1:19, 20 చూడుము.)

**సహానుభూతి ప్రదర్శించు ప్రభువు (4:15)**

ఈ అధ్యాయంలోని ముగింపు పలుకులు బలమైన ప్రోత్సాహమునిచ్చుచున్నవి. “ఆకాశమండలముల గుండ వెళ్లినవాడు” మన పట్ల గల తన ఆందోళనను చూపుతున్నాడు! యేసు అనేక సందర్భాలలో సహానుభూతితో కూడిన జాలిని ప్రదర్శించాడు. మత్తయి 9:36 ప్రకారం కాపరి లేని గొఱ్ఱెల వలె కనబడుచుండిన జనసమూహములపై ఆయన కనికరపడ్డాడు. ఆయనను వెంబడిస్తూ, ఆయన బోధలు వినుచుండి, ఆకలిగొనిన అయువేల మందిపై (స్త్రీలును) పిల్లలును గాక) ఆయన కనికరపడిన విషయం మత్తయి 14:14లో

కనబడుతుంది. ఇదే విధంగా ఆయన నాలుగువేల మంది పురుషులపై (స్త్రీలును పిల్లలును గాక) కనికరపడిన విషయం మత్తయి 15:32–38లో చూడగలము.

మత్తయి 18:23–35లో, కనికరము ప్రదర్శించాల్సిన అవసరమును తెలియజెప్పడానికి యేసు ఒక ఉపమానము బోధించాడు. యెరికో మార్గములో ఇద్దరు గ్రుడ్డివారిని ఆయన స్వస్థపరచిన విషయం మత్తయి 20:30–34లో చూడగలము. మార్కు 1:40–45లో, ఆయన ఒర కుష్ఠ రోగిని స్వస్థపర్చాడు. దయ్యముపట్టి పీడింపబడుచుండిన ఒకనిపై మన ప్రభువు చూపిన కనికరము గూర్చి మార్కు 5:1–20 చెప్పుతుంది. మార్కు 9:14–27లో, మూగదయ్యము పట్టిన పిల్లవాని మీద యేసు "కనికరపడిన" విషయమున్నది. లూకా 7:11–17లో, ఆయన నాయీను విధవరాలి ఏకైక కుమారుని మరణము నుంచి లేపిన విషయమున్నది. లూకా 10:30–37లో, మంచి సమరయుని కథ కలదు. కనికరము ప్రత్యేకమైన విధానంలో కనుపర్చబడిన వివరం ఈ కథ ద్వారా యేసు బోధించాడు. చివరగా, లూకా 15:11–24లో, తప్పు చేసిన తన తనయునిపై కనికరపడిన తండ్రి ఉదాహరనమును చూపిస్తూ, పరిసయ్యులు ప్రదర్శించిన స్ఫూర్తిని యేసు గద్దించాడు. యేసు హృదయం బీదలు, సమాజం చేత అణగద్రొక్కబడుచుండినవారు, రోగులు, మరియు బాధల్లో ఉండినవారి యెడల ఆయనకుగల సానుభూతి మరియు కనికరముతో నిండియుండింది. అలాగైతే, మనము మాత్రం అంతకు తక్కువైనవారముగా ఎలా ఉండగలము? నిశ్చయంగా, ఆయన, జాలి చూపెడువారి యెడల జాలిగలవాడును, కనికరము చూపెడువారి యెడల కనికరముగలవాడునై యుంటాడు. అధమాధమమైన ఉపచారము చేయడానికి – మన కాళ్లను కడుగుటకు, పతనమైన మన పరిస్థితి నుంచి మనలను తిరిగి లేపడానికి, మన రక్షణానందమును మనకు మరలా కలుగుజేడానికి ఆయన ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నాడు. మనము నిజముగా పశ్చాత్తాపపడి, ఆయన చూపిన మాదిరిగా కనికరము చూపించుటను అభ్యసించినట్లయితే, ఇదంతా వాస్తవమవుతుంది.

**కనికరముగల మన రక్షకుడు (4:15)**

మొదటి శతాబ్దములోని ప్రజలకు అవసరమై యుండిన విధంగానే, నేడు మనకు కూడ కనికరముగల రక్షకుడు అవసరమై యున్నాడు. గ్రీకు భాష మాటలాడుచుండిన దేశల్లో స్తోయికుల తత్త్వము బలముగా ప్రబలియుండింది. మానవుల పట్ల సానుభూతిని చూపగల లేదా ఒక్కొక్కరి గూర్చి చింతించగల సామర్థ్యం దేవునికి లేదని స్తోయికులు నమ్మారు. దేవుని గూర్చి వారికుండిన అభిప్రాయం *apatheia* అనే మాటతో వర్ణింపబడింది, "apathetic" (అర్థం, ఉదాసీనత) అనే పదం దీని నుంచే పుట్టింది. దేవుని యందు విశ్వసించినవారు జీవితం గూర్చి వారికుండిన దృక్పథమును పూర్తిగా మార్చుకొనవలసి యుండింది. అనేకులకు, ఈ వార్త వారి మీదుండిన ఒక భారీ భారమును తొలగించియుంటుంది. "మన దేవుడు మనల గూర్చి చింతించు దేవుడై యున్నాడు!" అందుకు సంబంధించిన నిదర్శనములు ఈలోకంలో కోకొల్లలుగా ఉన్నాయి (రోమీయులకు 1:19, 20). సూర్య రశ్మి, వర్షము, విస్తారమైన పంటలు, మరియు ఆయన సృష్టి నుంచి మనము పొందగల సమస్త సంతోషములను ఆయన మనకు సమకూర్చుచున్నాడు. క్రీస్తును వెంబడించు సాత్వికులు "భూలోకమును స్వతంత్రించుకొందురని" మనము చదువుచున్నాము (మత్తయి

5:5), ఏలయనగా యాథార్థమైన విశ్వాసులు మాత్రమే సమస్త మంచిలో దేవుని హస్తమును చూడగలరు. ఆయన సృజించిన సృష్టియే, “నేను మిమ్మును గూర్చి చింతిస్తున్నాను!” అని కేకవేయుచున్నది. ఆయన ఎన్నడును ఉదాసీనుడైన దేవుడు కాడు.

క్రైస్తవులు తమ జీవితంలో ఎదుర్కొను సమస్యలను మరియు హృదయవేదనలను భిన్నమైన స్ఫూర్తితో చూడవచ్చు. మనము ఈ లోకమునకు ఆవల గల నిత్యత్వము వైపు చూడగలము మరియు పరలోకమందలి నివాసము యొక్క మహిమతో పోల్చినట్లయితే, ప్రస్తుతకాలమందు మనము అనుభవించుచున్న బాధలు తేలికైనవనియు, అవి బుద్బుదప్రాయమైనవనియు తెలుసుకొనగలము (2 కొరింథీయులకు 4:16–18). మనము క్రైస్తవేతరునికి తెలియని, సువర్ణ వర్ణముగల సూర్యాస్తమయము లేదా నవనవలాడెడి పచ్చని వసంతకాలము కొరకు చెప్పశక్యముకాని ఆనందముతో ఎదురుచూడవచ్చు. క్రీస్తునందు మనకున్న నమ్మకమునుబట్టి మనము ఈ లోకంలో ఆనందానుభూతిని ఉత్తమోత్తంగా అనుభవించగలుగుచున్నాము.

**ఆయన నామములో వచ్చుట (4:16)**

అంతర్యుద్ధమునకు (Civil War) సంబంధించిన ఒక కథ, అతని కుమారుడు అంతర్యుద్ధంలో పోరాడుటకు వెళ్లిన ఒక బ్యాంకు నిర్వాహకుని గూర్చి చెప్పుతుంది. ఈ తండ్రి తన తనయుడు మరయు పోరాడుచుండిన సైన్యము యొక్క క్షేమం గూర్చి ఎంతగా ఆందోళన చెందాడంటే, గాయపడుచుండిన సైనికుల చికిత్స కోసం ధారాళంగా డబ్బులు ఖర్చుచేయడం మొదలుపెట్టాడు. సమయమంతా ఇదే పనిలో గడుపుచుండుటనుబట్టి అతని పైఅధికారులు అతనిని అధికారపూర్వకంగా మందలించి, ‘ఇక చాలు’ అని చెప్పారు. ఏది ఏమైనా, ఒకనాడు, ఒక యౌవనుడు అతని కార్యలయానికి వచ్చాడు. అతని ముఖం పాలిపోయి యుండింది, అతడు అంతర్యుద్ధంలో నుంచి తిరిగి వచ్చినవాడని స్పష్టమవుతుండింది, అయితే అతడు తన గాయముల నుంచి యింకా పూర్తిగా కోలుకోలేదు. వచ్చిన యౌవన సైనికుడు తన చొక్కా జేబులో నుంచి వర్షానికి తడిసి, ఎండకు ఆరిపోయిన ఒక ఉత్తరమును తీసాడు. బ్యాంకు నిర్వాహకునికిచ్చాడు. అందులో, “ప్రియమైన నాన్నగారికి: ఈ ఉత్తరం నీకందిస్తున్న ఈయన నా తోటి మిత్రుడు, యుద్ధంలో నాతో కూడ గాయపడ్డాడు. నీవు నన్ను ఎలా చూచుకుంటావో, దయచేసి ఇతన్ని కూడా అలాగే చూచుకొనుమని మనవిచేస్తున్నాను. మీ కుమారుడు, జాన్” అని వ్రాయబడి యుండింది. కాబట్టి బ్యాంకు నిర్వాహకుడు వెంటనే ఈ యౌవన సైనికునికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసాడు. ఈ సైనికుడు తన సొంత పేరుతో వచ్చియుండినట్లయితే, బహుశా వెనుకకు పంపివేయబడేవాడే; కాని ఇతడు బ్యాంకు నిర్వాహకుని కుమారుని పేరిట వచ్చాడు. మన పరలోకపు తండ్రికి అతి సన్నిహితుడు మరియు ప్రియమైన ఉత్తరవాది ఆయన యొద్ద మనకు ఉన్నాడనే విషయం, మనకు ఎంత గొప్ప దీవెనయై యున్నది కదా! క్రీస్తునుబట్టియే, మన నూతన ప్రధాన యాజకుడైనవానినిబట్టియే, ఆయన మన మొరలను ఆలకించునని మనకు తెలియుచున్నది!

### దేవుని యొద్దకు చేరుట (4:16)

క్రైస్తవులముగా, మనము దేవుని యొద్దకు చేరడానికి మనకు ఎటువంటి నిర్బంధమైనను లేదు. మనము ఆయనతో నేరుగా మాటలాడగలము, కాబట్టి మనము తండ్రితో మాటలాడుటకు యేసు గాక మరొక మధ్యవర్తి అవసరంలేదు. మనలో ప్రతి ఒక్కరము దేవుని యాజకులమై యున్నాము, పరిశుద్ధులును, రాజులైన యాజకసమూహమును అయియున్నాము (1 పేతురు 2:5, 9). అనగా, మనము దేవుని దృష్టిలో ఎంతో విలువైనవారమై యున్నామని దీని అర్థం. ప్రతి పరిశుద్ధుడు తన తన పనులను చేయడానికి నియమింపబడి యున్నాడు మరియు ప్రార్థన ద్వారా దేవుని యొద్దకు చేరగల ప్రత్యేకార్హతగలవాడై యున్నాడు. మనము ప్రార్థన చేయుచుండు ప్రతిసారి, "నేనిప్పుడు దేవుని కలుసుకోడానికి నా మధ్యవర్తియైన యేసు క్రీస్తు ద్వారా, ఆత్మరూపిగా దేవుని సింహాసనమున్న గదిలోనికే ప్రవేశిస్తున్నాను" అనే ఆనందానుభూతి చెందవచ్చు.

### కృపాసనము నొద్దకు చేరుట (4:16)

ఒకటి న్యాయం తీర్చడానికిని, మరొకటి కనికరము కుమ్మరించడానికిని అన్నట్టుగా, దేవునికి రెండు సింహాసనములు లేవు. తిరుగుబాటు చేయువాని హృదయంలో భయాంధోళనలను నింపు అదే సింహాసనం, విశ్వాసి హృదయంలో ఆదరణను నింపుతుంది. దేవుని పిల్లలైనవారు, "... మా తండ్రీ," అని చెప్పగలరు, ఇదే ఎంతో కలతలేని ప్రశాంతతను సమకూర్చుతుంది. వాడు ఏమని ప్రార్థన చేయాలో పాపి ఎరుగడు దేవుని సమీపించడానికి వానికి ధైర్యము లేదు. "భయపడకు, ధైర్యం తెచ్చుకో!" అని కూడ మనము వానికి చెప్పలేము. ఏది ఏమైనా, దేవుని పిల్లలైనవారు అనాది సిద్ధమైనవానిని (the Ancient of Days) ప్రేమగల తండ్రిగా చేరుకొనవచ్చు. మనము ప్రార్థన సమయాల్లో దేవుని కుమారునితో, కనికరముగలవానిగా కూర్చుండి మన కోసం విజ్ఞాపనము చేయువానితో (హెబ్రీయులకు 7:25), కూడ చేరవచ్చు. దేవునికిని మానవునికును మధ్య ఒక్కడే మధ్యవర్తియై, పరలోకమందు ఆయనే మన పక్షమున పనిచేయడం ద్వారా ఆయన మనకు సహాయము చేయుచున్నాడు (1 తిమోతి 2:5 చూడుము).

---

సూచికలు

[1]F. F. Bruce, *The Epistle to the Hebrews*, The New International Commentary on the New Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1964), 73, n. 17. [2]దేవుడు "విశ్రాంతిలో ఉండుటను శాశ్వతంగా నిలుపజాలడని" ఫిలో చెప్పాడు (Philo *On the Cherubim* 87–90). "విశ్రాంతి" అనేది బహుశా అది మత్తయి 11:28లో ప్రాస్తవిస్తున్నట్లుగా, ప్రస్తుతకాల విశ్రాంతిని సూచింపవచ్చునని Neil R. Lightfoot ఏకీభవించుచున్నాడు. (Neil R. Lightfoot, *Jesus Christ Today: A Commentary on the Book of Hebrews* [Grand Rapids, Mich.: Baker Book House, 1976], 96.) [3]William Barclay, *The Letter to the Hebrews*, 2d ed., The Daily Study Bible Series (Philadelphia: Westminster Press, 1957), 31. [4]Alexander C. Purdy, "The Epistle to the Hebrews: Introduction and Exegesis," in *The Interpreter's Bible* (Nashville: Abingdon Press, 1955), 11:630–31. [5]Jimmy Allen, *Survey of Hebrews*, 2d ed (Searcy, Ark.: by the author, 1984), 51. [6]ఈ హేతువు నిమిత్తము పాత నిబంధన ఒక విల ువైన ఉపకరణమై యుండిందని 1 కొరింథీయులకు 10:1–13 మరియు రోమీయులకు 15:4 సూచించుచున్నవి. [7]Thomas Hewitt, *The Epistle to the Hebrews: An Introduction and Commentary*, The Tyndale New Testa-

ment Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1960), 86. [8]సువార్త సమస్త జనులకు అందుబాటులో ఉండునట్లు సర్వలోకములో అది వ్యాపించుచున్నదని పౌలు ధ్వనించినప్పుడు (కొలొస్సయులకు 1:5, 6, 23), అప్పటికి దాదాపుగా లోకం మొత్తం క్రీస్తును ప్రభువుగా అంగీకరించలేదు. [9]ఒక చేతిరాత ప్రతిలోని ఇచ్చటి వైవిధ్యం వలన NKJV అనువాదకులు ఈ పదజాలమును, "దానిని వినిన వారితో కలిసియుండలేదని" అనువదించారు. NASBలో కూడ ఇదే అర్థమిచ్చు అనువాదమున్నది. [10]Donald Guthrie, *The Letter to the Hebrews: An Introduction and Commentary*, The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1983), 112. అపొస్తలుల కార్యములు 19:1–6ను కూడ చూడుము, అచ్చట "మీరు విశ్వసించినప్పుడు" అంటూ పౌలు అడుగుచుండిన సందర్భములో పౌలు, అపొల్లో మరియు ఇతరుల తొలి మతమార్పిడి గూర్చి ప్రశ్నిస్తున్నాడు. వారు పరిశుద్ధాత్మ గూర్చి వినలేదు కాబట్టి, వారి బాప్తిస్మము క్రమబద్ధమైనది కాదనియు, అది వాడుకలో లేని యోహాను బాప్తిస్మముపై ఆధారపడి యుండినదనియు ఆయన వెంటనే అర్థం చేసుకున్నాడు.'నేను కూడ నమ్ముతున్నానని' స్వాధికారంతో చెప్పుకొనిన ప్రతివానికి నీటి బాప్తిస్మము ఇయ్యబడియుంటుందని కూడ ఆయన భావించగలిగాడు.

[11]Ibid. [12]ASV మరియు NKJVలో కూడ దాదాపుగా ఇదే అనువాదమున్నది. NIVలో, "వారు నా విశ్రాంతిలో ఎన్నటికిని ప్రవేశింపరు" అనే అర్థమిచ్చు అనువాదమున్నది. [13]Gareth L. Reese, *A Critical and Exegetical Commentary on the Epistle to the Hebrews* (Moberly, Mo.: Scripture Exposition Books, 1992), 54, n. 4. [14]Ibid., 57, n. 20. హెబ్రీయులకు 9:26; మత్తయి 13:34, 35; 25:34; లూకా 11:51; యోహాను 17:24; ఎఫెసీయులకు 1:4–6; 1 పేతురు 1:20–21; ప్రకటన 13:8; 17:8 చూడుము. [15]Arthur W. Pink, *An Exposition of Hebrews* (Grand Rapids, Mich.: Baker Book House, 1954), 205. [16]Adapted from J. Harry Cotton, "The Epistle to the Hebrews: Exposition," in *The Interpreter's Bible*, ed. George Arthur Buttrick (Nashville: Abingdon Press, 1955), 11:631. [17]Brooke Foss Westcott, *The Epistle to the Hebrews: The Greek Text with Notes and Essays* (London: Macmillan & Co., 1889; reprint, Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1973), 96. ఈ విధమైన ప్రయోగము సాధారణమైన విషయమై యుండిందని Clement of Rome మరియు Philo నుంచి ఎత్తి చూపింపబడిన ఉదాహరణములు చూపించుచున్నవి. [18]ఏది ఏమైనా, "తప్పనిసరిగా" అని అర్థమిచ్చు పదము గ్రీకు మూల గ్రంథ పాఠంలో లేదు. [19]*Midrash Qoheleth* 10:20.1 విశ్వాసము లేకుండుటనుబట్టియే అరణ్యములో అందరు నాశనమయ్యారనే అభిప్రాయం విషయంలో యూదు మత బోధకులు సమస్యను ఎదుర్కొనుచుండిరి. అతని కుమారుడు రాజభవనం లోనికి ఇక మీదట ఎన్నటికినీ ప్రవేశింపబడని రాజుకు తెలిసింది, గనుక ఆయన కోపంతెచ్చుకొని, ఒట్టుపెట్టుకున్నాడను ఒక రాజును గూర్చిన ఉపమానముతో వారు పురోగమించారు. అతని కోపం సద్దుమణిగినప్పుడు, ఆ రాజు రాజభవనమును కూలగొట్టించి, తన కుమారుడు ప్రవేశించునట్లు ఒక క్రొత్త రాజభనమును నిర్మించాడు. (Reese, 59, n. 27.) సంబంధిత సాదృశ్యములు ఇటువంటి దేనినైనను రుజువుచేయుట లేదు; అవి కేవలము "గోడలోని కన్నం గుండా వేటాడినట్టున్నవి," హెబ్రీయులు ఇలా చేయరు. [20]Guthrie, 114.

[21]ఏది ఏమైనా, మూల గ్రంథ పాఠం అది నిజముగా యేసే అయియుండెనని భావిస్తున్నట్టు కొందరు నమ్ముతున్నారు, ఎందుకనగా ఆయన ఆ బండలో ఉండినాడు (1 కొరింథీయులకు 10:4) మరియు మోషే "క్రీస్తు విషయమైన నిందను" (హెబ్రీయులకు 11:26) కొంత మేరకు అర్థం చేసుకున్నాడు. [22]Westcott, 98. [23]Philip Edgcumbe Hughes, *A Commentary on the Epistle to the Hebrews* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1977), 160–61, n. 67; Plutarch *Morals* 166. [24]Robert Milligan, *A Commentary on the Epistle to the Hebrews*, New Testament Commentaries (Cincinnati: Chase and Hall, 1876; reprint, Nashville: Gospel Advocate Co., 1975), 166. [25]3:1ని ఎత్తి చెప్పుచూ, ఆ "ఒక్కడు" క్రీస్తు అయియున్నాడని Reese చెప్పుతున్నాడు. (Reese, 61–62.) [26]Albert Barnes, *Notes on the New Testament: Hebrews to Jude* (London: Blackie & Son, 1884–85; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1985), 103. [27]Hughes, 62, n. 44. [28]Isaac Watts, "Am I a Soldier of the Cross?" *Songs of the Church*, comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishers, 1977). [29]Allen, 52. [30]Raymond Brown, *The Message of Hebrews: Christ Above All*, The Bible Speaks Today (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1982), 90.

[31]Reese, 63. [32]Kenneth Samuel Wuest, *Hebrews in the Greek New Testament for the English Reader* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1947), 88. [33]Hughes, 167. [34]Gerald F. Hawthorne, "Hebrews," in *The New International Bible Commentary*, ed. F. F. Bruce,

H. L. Ellison, and G. C. D. Howley (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1986), 1513. [35]యోహాను 1:1–3, 14; 1 యోహాను 1:1, 10; ప్రకటన 19:13 చూడుము. *Logos* అనే పదమును ఫిలో "దైవికమైన ఆలోచన"గా ప్రయోగించుచున్న దానికి సమానాంతరములను కొందరు రచయితలు కనుగొనుచున్నారు. *Logos* అనే పదము ఇచ్చట మరియు యోహాను (1:1)లోను వాడబడింది, కాని హెబ్రీ పత్రికలో అది యేసునకు బదులుగా, దేవుని యొక్క "దైవికమైన వాక్కు"ను సూచించుచున్నది. (Westcott, 101.) [36]Warren W. Wiersbe, *Be Confident: An Expository Study of the Epistle to the Hebrews* (Wheaton, Ill.: Victor Books, 1982), 44. [37]Guthrie, 117. [38]Cotton, 11:630. [39]Hewitt, 90. Westcott ఇదే విధంగా వ్యాఖ్యానించాడు: "అది [హక్కు] మన ఐహిక నిర్మాణంలోని ప్రతి అంశము గుండా దాని మార్గమును కనుగొంటుంది" (Westcott, 102). [40]R. C. H. Lenski, *The Interpretation of the Epistle to the Hebrews and the Epistle of James* (Columbus, Ohio: Wartburg Press, 1946), 144.

[41]James Burton Coffman, *Commentary on Hebrews* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1971), 90–91. [42]Ray C. Stedman, *Hebrews*, The IVP New Testament Commentary Series (Downers Grove, Ill.: InterVarsity Press, 1992), 60. [43]Brown, 95. [44]Josephus *Antiquities* 3.6.4. [45]Westcott, 106. [46]Lightfoot, 100. [47]Westcott, 107. [48]ఇది బలహీనతకు బదులుగా, బలమనే భావమును ధ్వనించుచున్నది. [49]Coffman, 94. [50]Allen, 55–56.

[51]యేసు పాపము చేయజాలనివాడై యుండెను కాని ఆయన పాపమును ఎరుగడు ఎందుకనగా ఆయన తన నరావతారములో ఉండినప్పుడు ఆయన జ్ఞానము పరిమితమైనదై యుండిందని Gerald F. Hawthorne సూచించాడు (మార్కు 13:32). (Hawthorne, 1513.) ఆయన పాపము చేయలేదని మాత్రమే లేఖనములు సెలవిచ్చుచున్నవి (2 కొరింథీయులకు 5:21; 1 పేతురు 2:21, 22; యోహాను 8:29, 46; 10:32; 1 యోహాను 3:6, 7 చూడుము). [52]Philo *On Dreams* 2.230–32. [53]LXXలో "యాజకత్వ పరిచార ధర్మము ప్రకారం దేవుని యొద్దకు చేరుటకు" ఇదొక సాంకేతికపరమైన పదమై యున్నది. ఈ విధంగా అది లేవీయకాండము 21:17, 21; 22:3లో ప్రయోగింపబడింది, అయితే దీనికి విస్తృతమైన అన్వయములు కూడ కలవు. [54]Ibid. [55]Wiersbe, 48. [56]"కాని, ప్రాణం మరియు ఆత్మ ఎలా రెండు వేర్వేరు అంశములుగా విడిపోవునో చూడవలెనని మనము యింకను ఎదురుచూచుచునే యున్నామని" చెప్పుతూ, Lenski ఈ విషయంలో తన ఆక్షేపణను తెలిపాడు. (Lenski, 144.) [57]George Wesley Buchanan, *To the Hebrews: Translation, Comment, and Conclusions*, The Anchor Bible, vol. 36 (Garden City, N.Y.: Doubleday, 1972), 75. [58]Reese, 64, n. 52. [59]క్రైస్తవులు అదివరకే కలిగియున్న ఆత్మసంబంధమైన విశ్రాంతిలోను, నిత్య నివాసము వాగ్దానము చేయబడిన దానిలోను ఇట్టి ఆచారము నెరవేరినప్పటికిని, "క్రైస్తవ సబ్బాతు" ఆచారమును మనము నేడు సహితం పాటించవలసిన అవసరమున్నదని ప్రతిరక్షించడానికి కొందరు (Pink, 210–11 వంటివారు) యింకా ఎలా వెదకుచున్నారుకదా అనేది ఆశ్చర్యంగా ఉన్నది. [60]Craig R. Koester, *Hebrews: A New Translation with Introduction and Commentary*, The Anchor Bible, vol. 36 (New York: Doubleday, 2001), 279.

[61]Cotton, 632. [62]Bruce, 74–75, n. 20. రెండవ శతాబ్దములో ఈ విషయాలను Barnabas దృక్పథము ఆధారంగా Bruce సుదీర్ఘంగా ఉల్లేఖించాడు. [63]Adapted from Barclay, 33. [64]Stedman, 57. [65]Brown, 90. [66]"ఒక రోజు ఆలస్యమైపోయింది" అనే ఆలోచన Pink, 214 చేత సూచింపబడింది. [67]Pink, 217. పాఠ్యభాగమును గూర్చిన Pink యొక్క దృష్టికోణమే సరైనదని – "ప్రాణాత్మలు విభజింపబడుట" పునఃరుజ్జీవములో అక్షరాలా జరుగుతుందనే అర్థమిచ్చుచున్నదని – ఆరవ వాంగ్మూలము భావించుచున్నది.